


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 57 | గురువారం 26 - 02 -2026 | పేజీలు : 12 | వెల-3


## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలపై స్పందించిన హైడ్రా కమిషనర్



## వెలిగొండ పూర్తి కాకుండానే రిబ్బన్ కట్

పనులు పూర్తయ్యాయని దొంగమాటలతో మోసం

వెలిగొండ పూర్తి చేసి రైతుల కష్టాలు తీరుస్తా

పనిచేసే ప్రభుత్వాని అండగా ఉండాలి

ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశా

వెలిగొండ ప్రాజెక్టు పనులు పరిశీలించిన చంద్రబాబు

2లో



జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. బుధవారం మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నా నని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు.

## గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి



దేశాన్ని మరింత ధృడంగా నిర్మించడమే లక్ష్యం

సాదాసీదా స్థాయి నుంచి సుదృఢ అమెరికాను నిర్మించా

పౌరుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నా

ఇరాన్ అణు కార్యక్రమాలతో అప్రమత్తంగా ఉన్నా

తన పాలనా ప్రయాణం యుగాలకు మలుపు

స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ ప్రసంగం

2లో

అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవారం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు.



ఉగాది కానుకగా

2లో

## ఇందిరమ్మ ఇళ్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఏర్పాట్లు

ఉగాదిలోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాలని లక్ష్యం

సొంత స్థలం ఉన్న పేదలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం

మురికివాడల్లో మోడల్ కాలనీల నిర్మాణం.. 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీకి ప్లాన్

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 3 లక్షల ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం

## హైదరాబాద్ వాసుల కోసం సర్కార్ ప్రత్యేక ప్రణాళిక

హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండగలోపు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే చేపట్టి

## యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

కేంద్రం చర్యను తప్పుపట్టిన ప్రియాంక



2లో

ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ యువ నేతలు భారత్- అమెరికా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ చొక్కాలు విప్పి నిరసన తెలిపారు. సమ్మిట్‌లో నిరసన చేసిన కాంగ్రెస్ నేతల్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా ఖండించారు.



## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం..

క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక


రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్

ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్

పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం

2లో

## ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు"..



రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ఘటనలపై ఆరా

శ్రీకాకుళం డయేరియా బాధితుల్లో ఇద్దరికి సీరియస్

మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు సీఎంకు తెలిపిన అధికారులు

2లో

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ

2లో

ఇజ్రాయిల్ పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం





## నందీశ్వర ఆలయంలో జగన్ ప్రత్యేక పూజలు

వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని సందర్శించిన జగన్

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ అధినేత

2లో

# పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం..

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగ వంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు. ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటివరకు నిర్వహించిన 1,587 జాబ్ మేళాల ద్వారా 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి కార్మికులను తయారు చేసేందుకు న్యాక్‌ను 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్ సభకు హామీ ఇచ్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేసి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

# ఉగాది కానుకగా ఇందిరమ్మ ఇళ్లు..

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు.

**సొంత స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం** ప్రస్తుతం సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. గ్రేటర్ పరిధిలో సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, ఈ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

**బహుళ ప్రణాళికలతో ముందుకు** మురికివాడల్లో నివసించే వారి కోసం "ఇందిరమ్మ మోడల్ కాలనీలు" నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగరానికి దూరంగా ఇళ్లు కేటాయిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో, వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన స్థల సేకరణపై మంత్రులు ఇటీవల అధికారులతో చర్చించారు. వీటితో పాటు, నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు కేటాయించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా జోరుగా పనులు** ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగంగా సాగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వారిలో 2.50 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# నందీశ్వర ఆలయంలో జగన్ ప్రత్యేక పూజలు

పులివెందుల పర్యటనలో ఉన్న వైసీపీ అధినేత జగన్ కాసేపటి క్రితం వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని సందర్శించుకున్నారు. నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా ఆయన నందిపల్లికి వచ్చారు. నందీశ్వర ఆలయం వద్దకు చేరుకున్న జగన్ కు... ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నంది విగ్రహం వద్ద జగన్ కొబ్బరికాయ కొట్టి, పూలమాలను సమర్పించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. హోమ సన్నిధికి చేరుకుని యజ్ఞయాగాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం జగన్ పులివెందుల చేరుకుని, తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు.

## ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండ

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లిన సంగతి తెలిసిందే. పర్యటనలో భాగంగా బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని తానేనని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత కలిగిన దేశాలు. ఇజ్రాయెల్‌తో 140 కోట్ల భారతీయుల స్నేహం, గౌరవం, భాగస్వామ్యం ఉంది. ఉగ్రవాదంపై పోరులో ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా ఉన్నాం. ఉగ్రవాదంతో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. ఉగ్రవాదానికి భారత్ పూర్తి వ్యతిరేకం. శాంతిస్థాపన అనేది అంత సులువైన విషయం కాదు. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు'..ఇజ్రాయెల్‌ను గుర్తించిన 1950లోనే నేనూ జన్మించా. ఇజ్రాయెల్‌తో భారత్‌కు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ పౌరులను హమాస్ చంపడం దారుణం. ఇజ్రాయెల్ పౌరుల హత్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించం. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి. భారత్ ఎప్పుడూ చర్చలు, శాంతినే కోరుకుంటుంది' అని అన్నారు. ఇజ్రాయెల్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ పార్లమెంటులో ఘనస్వాగతం లభించింది. ఇజ్రాయెల్ పార్లమెంటు 'నెస్సెట్'ను ఉద్దేశించి మోదీ బుధవారంనాడు ప్రసంగించారు. పార్లమెంటు హాలులోకి మోదీ ప్రవేశించగానే సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో మోదీకి స్వాగతం పలికారు. 'మోదీ... మోదీ' నినాదాలు హోరెత్తించారు. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు వంటి అత్యంత కీలక మిత్రదేశాల అధినేతలకు మాత్రమే దక్కే ఈ అరుదైన గౌరవం భారత ప్రధానికి దక్కడం విశేషం. నెస్సెట్ స్పీకర్ అమీర్ ఒహానా మాట్లాడుతూ, నెస్సెట్ స్పీకర్‌గా సభలో ప్రసంగించనున్న తొలి ప్రధానిని ఆహ్వానించే అవకాశం దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. 'థాంక్యూ ప్రైమ్ మినిస్టర్ మోదీ' అంటూ హర్షాతిరేకం వ్యక్తం చేశారు.

# యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రామావతారంలో హనుమంత వాహన సేవలో నారసింహుడు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై యాదగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారు ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నయన మనోహరంగా స్వామివారు అలంకార సేవపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. లోక కల్యాణం కోసం స్వామివారు వివిధ అవతారాలు ఎత్తారని ఈ సందర్భంగా అర్చకులు ఉపదేశించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద మంత్రలు, వేదపారాయణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా స్వామి వారి ఊరేగింపు సేవ పై ఊరేగారు. రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తర మాడవీధుల్లో ప్రత్యేకమైన కల్యాణ వేదికను సిద్ధం చేశారు. వీవీఐపీ, వీఐపీ, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే విధంగా ప్రత్యేకమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపైన పలు ప్రాంతాల్లో ఎల్ ఈ డీ స్క్రీన్లను ఉంచారు.

# నాలగేళ్లయినా ముగియని ఉక్రెయిన్ సంక్షోభం !

ప్రపంచంలో ఏ యుద్దాలను తీసుకున్నా నష్టపోతున్నది ప్రజలే. ఆయా దేశాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. ప్రపంచ దేశాలను నష్టాల కుంపట్లో పడేస్తున్నాయి. రష్యా,ఉక్రెయిన్ యుద్ధం మొదలై నాలుగేళ్లు దాటింది. ఎందుకు యుద్ధం మొదలు పెట్టారో తెలియడం లేదు. అలాగని ముగింపు కూడా పలకడం లేదు. ఈ రావణ కాష్టం ఇప్పట్లో చల్లారేలా లేదు. అగ్రరాజ్యం తలచుకుంటే అంతే సంగతులని రష్యా నిరూపిస్తే... అమెరికా దానిని నిజం చేసింది. రష్యా బాటలోనే అమెరికా కూడా అడపాదడపా దాడులతో ప్రపంచాన్ని గుప్పిట పెట్టుకోవాలని చూస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భౌతిక దాడులతో పాటు, ఆర్థిక దాడులతో ప్రపంచాన్ని బెంబేలెత్తిస్తున్నారు. ఇకపోతే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ చేష్టల కారణంగా రష్యాతో కయ్యానికి దిగారు. పుతిన్, ఎలన్‌స్కీ ఇద్దరూ బాగానే ఉన్నారు. కానీ ఇరు దేశాల ప్రజలు తీరని సంక్షోభంలో కూరుకు పోయాయరు. వేలాదిమంది మృత్యువాత పడ్డారు. ఫిబ్రవరి 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధం ఐదెయేట ప్రవేశించింది. దీనికి బాధ్యులైన నాటో కూటమి దేశాలు ఎలా, ఎప్పుడు ముగింపు పలుకుతాయో తెలియటం లేదు. నిజానికి ట్రంప్ కూడా ముగింపు చేసే సాహసం జరగడం లేదు. యుద్దాలకు నేను ముగింపు పలుకుతున్నానని బీరాలు పలికిన ట్రంప్ ఈ యుద్దాన్ని కూడా ఆపుతానని చెప్పినా, ఆ పని చేయలేక పోయారు. ఉక్రెయిన్ తాజా సంక్షోభానికి నాలుగేళ్లు నిండినప్పటికీ నిజానికి 2014 నుంచి ఈ అంతర్యుద్ధం కొనసాగుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపా ఖండంలో దీర్ఘకాలం సాగిన పోరుగా ఇప్పటికే చరిత్రలో ఉక్రెయిన్ సంక్షోభం నమోదైంది. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. ఏ దేశం కూడా ఎదుర్కోని తీవ్రమైన ఆంక్షలను రష్యా మీద నాటో కూటమి దేశాలు అమలు చేస్తున్నాయి. రష్యాతో వాణిజ్య లావాదేవీలు నిర్వహించే భారత్ తదితర దేశాల మీద కూడా అపరాధ పన్నుల విధింపు, ఇతర చర్యలు తీసుకుంటామని అమెరికా బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనకుండా చేసిన ట్రంప్ ఎలా పెత్తనం సాగిస్తున్నాడో గమనించవచ్చు. ఇప్పటి వరకు ఉక్రెయిన్ పోరులో రెండు దేశాలకు జరిగిన నష్టాల గురించి పరస్పరం అతిశయోక్తులు తప్ప నిజానిజాలు వెల్లడి కావటం లేదు. రెండు వైపులా 20 లక్షల మంది సైనికులు గాయపడటం లేదా మరణించి ఉంటారన్నది ఒక అంచనా. పన్నెండున్నర లక్షల మంది రష్యన్లు మరణించి నట్లు ఉక్రెయిన్ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సిఎస్ఐఎస్ అనే సంస్థ 3.25 లక్షల మంది మరణించటంతో సహా పన్నెండు లక్షల మంది రష్యా వైపు బాధితులు ఉన్నట్లు చెబుతున్నది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏ పోరులోనూ ఇంత నష్టం జరగలేదు. తమకు వ్యతిరేకంగా నాటో విస్తరణ పేరుతో ఉక్రెయిన్‌కు సభ్యత్వ మిచ్చి తమ ముంగిటకు అణ్వాయుధాలను మోహరించాలన్న అమెరికా ఎత్తుగడలను వమ్ము చేస్తూ గతంలో తన ప్రాంతంగా ఉన్న క్రిమియా ద్వీపాన్ని రష్యా ఆ ఏడాది విలీనం చేసుకుంది. ఉక్రెయిన్ పాలకులు అప్పటి నుంచి రష్యన్లు మెజారిటీగా ఉన్న తమ డాన్‌బాస్ ప్రాంతంపై దాడులకు మిలిటరీని దించారు. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతంలో తలెత్తిన తిరుగుబాటుకు రష్యా మద్దతు ఇచ్చింది. సైనిక చర్య ప్రారంభించి నప్పటి నుంచి నాలుగేళ్ల కాలంలో 26 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మెల్లమెల్లగా కొత్త ప్రాంతాలకు చొచ్చుకుపోతున్నది. ఈ నాలుగేళ్ల యుద్ధ పర్యవసానాలను పరిశీలిస్తే ఇది అంత తేలికగా ముగిసేలా లేదు. పుతిన్ కూడా వదిలేలా లేరు. ఇప్పుడున్న యథాతథ స్థితిలో పోరు ముగించటానికి తాము సిద్ధమేనని, అయితే డాన్‌బాస్ తూర్పు ప్రాంతంలో తమ మిలిటరీ అక్కడే ఉండాలని జెలెన్‌స్కీ పట్టుబడుతున్నాడు. ఉక్రెయిన్ తిరుగుబాటు ప్రాంతాలకు స్వాతంత్ర్యం ఇవ్వాలని, దాని మిలిటరీ బలం, ఆయుధాలను పరిమితం చేయాలని, మరేదేశ మిలిటరీ ఏ రూపంలోనూ ఉక్రెయిన్ గడ్డ మీద ఉండకూడదని పుతిన్ పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే అమెరికా ప్రభావంలో ఉన్న జెలెన్‌స్కీ మాత్రం పాత సోవియట్ బంధాన్ని మరచి వ్యవహరించడమే యుద్దానికి హేతువుగా గుర్తించాలి. ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా, మిలిటరీ రవాణాకు కీలకమైన రైల్వేలు, రోడ్లు ఈ ప్రాంతంలోనే ఉన్నందున వాటిని వదులుకొనేందుకు పుతిన్ సిద్ధంగా లేడు. ఇకపోతే దాడుల కారణంగా ఉక్రెయిన్ జనాభా 4.2 కోట్ల మందిలో నాలుగో వంతు మంది ఇతర దేశాలకు తరలిపోయినట్లు చెబుతున్నారు. రష్యా ఆధీనంలోని ప్రాంతాలలో 50 లక్షల మంది నివశిస్తున్నారు. క్రిమియాతో సహా 26 శాతం భూ భాగాన్ని ఉక్రెయిన్ కోల్పోయింది. అయితే జెలెన్‌స్కీ దళాలు తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తీసి వేస్తే ఆ మొత్తం 20 శాతానికి తగ్గినట్లు మరొక అంచనా. గత మూడు సంవత్సరాల్లో పెద్దగా రష్యన్లు ముందుకు పోలేదని మరి కొందరు చెబుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభం నుంచి నాలుగేళ్లలో ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. రష్యా ప్రధాన కేంద్రీకరణ మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, ఆర్థిక మూలాలను దెబ్బ తీయటంపైనే కొనసాగుతున్నది. విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా ఫ్యాక్టరీలను నడిపేందుకు డీజిల్ జనరేటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. మిలిటరీ చర్య ప్రారంభించిన తొలి రోజుల్లో పుతిన్ యంత్రాంగం వేసిన అంచనాలు దెబ్బతిన్నాయి. నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధాలు, ఆర్థిక సాయంతో పాటు రష్యన్ మిలిటరీ కదలికల గురించి కీలకమైన సమాచారాన్ని అందించటంతో తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. దాంతో వ్యూహం మార్చు కోవాల్సి వచ్చింది. కొన్ని వారాల్లో కీవ్ పతనం అవుతుందన మాస్కో అంచనాలు తప్పాయి. రష్యా కోరిన విధంగా కొంత ప్రాంతాన్ని కోల్పోయి ఒప్పందం చేసుకుంటే సరే లేకపోతే ఉక్రెయిన్ గెలిచే అవకాశాలు లేవని డోనాల్డ్ ట్రంప్ గతేడాది నవంబరులో బహిరంగంగానే చెప్పాడు. గతేడాది ఇరాన్ మీద దాడులు, మరోసారి హెచ్చరికలు, వెనిజులా అధ్యక్షుడిని అపహరించిన డోనాల్డ్ ట్రంప్ రష్యా మీద చర్యకు ఎందుకు వెనకాడుతున్నట్లు అని కొందరు విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. రష్యా మీద ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ అవి పనిచేయటం లేదని ట్రంప్‌కు అర్థమైంది. మొత్తానికి ఈ రావణ కాష్టం చల్లారేలా లేదు. ఇరు దేశాలు కూర్చుంటేనే సయోధ్య కుదరగలదు. అమెరికాలాంటి దేశాలు, నాటో జోక్యం వల్లనే ఇది మరింత ముదిరిందన్న సుస్పష్టం.

## 2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసు శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అరెస్ట్

2019 ఈస్టర్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీలంక మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున రాజధాని శివారులో రిటైర్డ్ మేజర్ జనరల్ సురేష్ సల్లేను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈస్టర్ ఆదివారం పేలుళ్లకు కుట్ర పన్నడం, సహాయం చేయడం మరియు ప్రోత్సహించినందుకు ఆయనను అరెస్ట్ చేశారని అన్నారు. గోటబయ రాజపక్స అధ్యక్షుడైన తర్వాత 2019లో స్టేట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎస్ఐఎస్) చీఫ్‌గా సురేష్ పదోన్నతి పొందారని, ఆత్మాహుతి బాంబుదాడులకు సహకారం అందించారని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. సురేష్ ఇస్లామిక్ బాంబర్లతో సంబంధం కలిగి ఉన్నాడని, దాడికి ముందు వారిని కలిశారని బ్రిటన్ మీడియా 2023లో వెల్లడించింది.

# వెలిగొండ పూర్తి కాకుండానే రజగన్ రిబ్బన్ కట్

ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. బుధవారం దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులని పరిశీలించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కెనాల్‌లో సీఎం చంద్రబాబు తిరిగారు. స్థానికంగా ఏఏ పంటలు పండిస్తున్నారో అన్నదాతలని అడిగి తెలుసుకున్నారు. లైనింగ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిలో వేగం పెంచాలని మార్గనిర్దేశర చేశారు. లలాగే, వెలిగొండ రెండో టన్నెల్‌లో పని చేస్తున్న ఇంజనీర్స్‌తో లైవ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. టన్నెల్‌లో లైనింగ్ పనులని లైవ్‌లో పరిశీలించారు. జూన్ 15వ తేదీ నాటికి టన్నెల్‌లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 15వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తానని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రతి సోమవారం వెలిగొండ ప్రాజెక్టు పనులపై సమీక్షిస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంచి చేసిన వారికి అండగా ఉంటేనే మీ జీవితాలు మారతాయి. ప్రతి విషయంలో మీకు అండగా చంద్రన్న ఉంటాడు. మార్కాపురం జిల్లాను ఉద్యానవనంగా తయారు చేస్తాం. పండ్లతోటల వల్ల రైతుల ఆదాయం బాగా పెరుగుతుంది. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించా. ఈ ఏడాది వెలిగొండపై దృష్టి పెట్టానని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గతం కన్నా ధృడంగా అమెరికా ఆర్థిక వృద్ధి

దేశ ఆర్థికాభి వృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగుపడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదాసీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలిపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలిపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిపుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాల ను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటినుంచి నేటివరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ఆయన అతి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సుమారు గంటా 50 నిమిషాల పాటు ట్రంప్ మాట్లాడారు. తన ప్రసంగాల్లో ఇదే అతిసుదీర్ఘమైందిగా రికార్డుకెక్కింది. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ అత్యధికంగా 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఇప్పుడు ఆ రికార్డును ట్రంప్ బ్రేక్ చేశారు. గత ఏడాది మార్చిలో కూడా ట్రంప్ సుమారు 100 నిమిషాల పాటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా ఆర్థిక ఎజెండా గురించి ప్రస్తావించారు. ఇక ఇరాన్ అంశంలో వార్నింగ్ ఇచ్చారు. వాస్తవానికి ఆ సమస్యను దౌత్యం ద్వారా పరిష్కరించేందుకు ఇష్టపడుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ అణ్వాయుధాలను సమీకరిస్తున్న ఇరాన్ వైఖరిని మాత్రం ట్రంప్ ఖండించారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ విరమించుకోవాలన్నారు. అమెరికాను తాకే క్షిపణులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కానీ దీనిపై ఆయన తన ప్రసంగంలో ఎటువంటి ఆధారాలను బయటపెట్టలేదు. యురోప్‌కు ప్రమాదంగా మారే కొన్ని మిస్సైల్స్‌ను ఇప్పటికే ఇరాన్ డెవలప్ చేసిందన్నారు. ఇతర దేశాల్లో ఉన్న అమెరికా బేస్‌లను కూడా టా÷-గ్గ÷ట్ చేసే రేంజ్ ఇరాన్‌కు ఉందన్నారు. ఇక అమెరికా భూభాగానికి చేరుకునే స్థాయికి తగ్గ క్షిపణులను కూడా ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. మిడిల్ ఈస్ట్‌పై ట్రంప్ ఎక్కువగా ఫోకస్ చేయడం వల్ల.. ఇరాన్‌తో యుద్దానికి ఆ దేశం సిద్ధం అవుతుందేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తాము ఇచ్చిన డిమాండ్లను ఒకవేళ ఇరాన్ అంగీకరించకపోతే, అప్పుడు ట్రంప్ అనుకున్నంత పనిచేసే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడి చేశామని, ఆ దాడి వల్ల ఆ దేశ న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్ స్తంభించినట్లు ట్రంప్ చెప్పారు. న్యూక్లియర్ వెపన్ అంశంలో ఇరాన్ ఇంకా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. అణ్వాయుధాలను తయారు చేయమన్న వ్యాఖ్యలు ఇంకా ఇరాన్ నుంచి రావడం లేదన్నారు.

# యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్ సిగ్గుచేటు

ఈ అరెస్టు సిగ్గుచేటని ఆమె ధ్వజమెతారు. 'సత్యం కోసం, శాంతియుత, అహింసాయుత ప్రతిఘటన మనం గర్వించదగిన వారసత్వం. ఇది మహాత్మాగాంధీ, లక్షలాది మంది భారతీయుల పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చింది. ప్రపంచ ఒత్తిడికి తలొగ్గి భారతదేశ ప్రయోజనాలతో రాజీపడిన ప్రధానికి, ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం పెంచడం 1.4 బిలియన్ల భారతీయుల ప్రయోజనాలకు మంచిది. ప్రజల గొంతును పెంచినందుకు యూత్ కాంగ్రెస్ సభ్యులపై తీసుకున్న చర్య తీవ్రంగా ఖండించదగినది. సిగ్గుచేటైన విషయం. కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ యొక్క నిర్భయ సైనికులకు దృఢంగా అండగా నిలుస్తుంది ' అని ఆమె బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పేర్కొన్నారు. చేశారు. అని ప్రియాంక ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ÷ూగా, ఎఐ సదస్సులో షర్ట్ విప్పి నిరసన తెలిపిన ఘటనకు కీలక సూత్రధారిగా భావించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదరు భాను చిబ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఉదరు భానుతోపాటు మరో ఆరుగురు కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టు చేసి.. వారిపై అల్లర్లకు పాల్పడినట్లు పోలీసులు అభియోగాలు మోపారు.

# ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు"..

ప్రజారోగ్యం విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. శ్రీకాకుళంలో విజృంభిస్తున్న డయేరియా, రాజమహేంద్రవరంలో కలకలం రేపిన కల్తీ పాల ఘటనలపై బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళంలో డయేరియా బారిన పడి ప్రస్తుతం 76 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని.. ఒకరికి వెంటిలేటర్‌పై, మరొకరికి డయాలసిస్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా క్లీన్ డ్రింకింగ్ వాటర్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కాగా, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా స్వయంగా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. రాజమహేంద్రవరం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. పాల శాంపిల్స్ నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మున్సిపల్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

# శ్రీశైలం దేవస్థానంలో చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం





**శ్రీశైలం ఫిబ్రవరి 25(నంది పత్రిక)** ప్రతీ నెలలోనూ ఒకరోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించడం జరిగింది. గత నెలలో ముక్కోటి ఏకాదశి రోజున (30.12.2026) ఈ కార్యక్రమం ప్రారంభించబడింది. ప్రతీ నెలలో కూడా చివరి బుధవారం రోజున చెంచు గిరిజన భక్తులకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతోంది. ఇందులో భాగంగా చెంచు భక్తులకు శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం ఉచితంగా దర్శించుకున్నారు. స్థానిక మేకలబండ, హాటకేశ్వరం, సున్నిపెంటలోని చెంచుభక్తులతో పాటు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం హనుమాపురం తాండ, మాచర్ల మండలం బోధనంపాడు, దుర్గి మండలం తేరాల నుంచి కూడా చెంచు భక్తులు శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చెంచు గిరిజనులకు దేవస్థానం ఉచిత వసతి, అల్పాహార, భోజన సదుపాయం కల్పించింది. అదేవిధంగా దర్శనానంతరం చెంచు భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ రోజు ఉదయం చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్ధంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం అధికారులు వారికి ఆహ్వానం పలికారు. తరువాత కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ చెంచు భక్తులు శ్రీ భ్రమరాంబాదేవివారిని తమ కూతురిగా, శ్రీ మల్లికార్జునస్వామివారిని తమ అల్లునిడిగా భావిస్తారన్నారు. దేవస్థానంలో జరిగే ఆయా ఉత్సవాలలో గ్రామోత్సవం నందు ప్రత్యేకంగా చెంచుల సంప్రదాయ నృత్యాలను దేవస్థానం ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు.

అలాగే సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో దివ్య కల్యాణమహోత్సవానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందన్నారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక

ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమములో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. .





## ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న శాంతిపురం అస్రర్ మలుపు

### ఆర్ అండ్ బి నిర్లక్ష్యానికి మరో నిదర్శనం!






**పోరుమామిళ్ల ఫిబ్రవరి 25 (నంది పత్రిక ):** కడపవిజయవాడ ప్రధాన రహదారిపై, పోరుమామిళ్లకొమరోలు మార్గమధ్యంలో శాంతిపురం అస్రర్ సమీపంలోని మలుపు ప్రస్తుతం మృత్యు మలుపుగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన కంపచెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. ఈ మార్గంలో నిత్యం వాహన రాకపోకలు సాగుతున్నప్పటికీ, రహదారి భద్రతపై (ఆర్ అండ్ బి) శాఖ చూపుతున్న నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లుగా మారిందిమలుపు వద్ద యూ–టర్న్ ఉందని తెలియజేసే సూచిక బోర్డులు, బాణపు గుర్తులు ఉన్న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, అవి కంపచెట్ల మధ్య పూర్తిగా మరుగున పడిపోయి వాహనదారులకు స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో మలుపు ముందే హెచ్చరిక లేకుండా వాహనాలు రావడం ప్రమాదాలకు కారణమవుతోంది. ఇదే ప్రాంతంలో గతంలో ఓ తండ్రి తన కుమార్తెను కలవడానికి వస్తూ ఇదే మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదం జరిగిన ప్రతిసారి "హెల్మెట్ లేదు, ఓవర్ స్పీడ్" అబ్జర్వేషన్ మిర్రర్స్ లేనందువలన అంటూ మృతులపైనే నిందలు వేయడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్వహణ కూడా ప్రభుత్వ శాఖ బాధ్యతేనని గుర్తించాలని వారు స్పష్టం చేస్తున్నారు. ఇరువైపులా ఉన్న కంపచెట్లను వెంటనే తొలగించి, యూ–టర్న్ సూచిక బోర్డులు, బాణపు గుర్తులు స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## కోర్టు కేసులు వేగంగా పరిష్కారానికి చర్యలు

### కోర్టు కేసుల సమీక్షలో కమిషనర్ పి.విశ్వనాథ్

### న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులపై సమీక్ష



**కర్నూలు నంది పత్రిక.....** నగరపాలక సంస్థకు సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు వేగంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కోర్టు కేసుల స్థితిగతులపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, పిటిషన్‌దారులు, న్యాయవాదులతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పరిష్కారించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌంటర్ల దాఖలు, న్యాయస్థానాల ఆదేశాల అమలు వంటి ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, ఇంచార్జి సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, లీగల్ అడ్వైజర్ కృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే బడి తోట లక్ష్యం

### జెవివి జిల్లా కార్యదర్శి ఖాసిం వల్లి



**కాశినాయన ఫిబ్రవరి 25 (నంది పత్రిక):** బడి తోటలో పండే కూరగాయలు, ఆకుకూరల ద్వారా విద్యార్థుల్లో రక్తహీనత (అనీమియా)ను నివారించడమే కాకుండా పోషక విలువలు పెంపొందించవచ్చని జెవివి జిల్లా కార్యదర్శి ఖాసిం వల్లి తెలిపారు. బుధవారం కాశినాయన మండలం బాలాయపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం మెనూలో భాగంగా, బడి తోటలో సహజసిద్ధమైన ఎరువులతో సాగు చేసిన స్వచ్ఛమైన చిక్కుడుకాయలతో ప్రత్యేకంగా తాలింపు వంటను తయారు చేసి విద్యార్థులకు అందించారు. ఈ బడి తోటలో పండే వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల ద్వారా విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ఖనిజ లవణాలు అందుతున్నాయని, తద్వారా వారి శారీరక ఆరోగ్యం, రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని ఖాసిం వల్లి పేర్కొన్నారు. చిన్న వయస్సు నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవడితే విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని తెలిపారు. బడి తోట నిర్వహణలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ విద్యార్థులను కూడా సాగు కార్యక్రమాల్లో భాగస్వాములుగా చేసి, ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లా దస్తగిరి బాబు, శానిటేషన్ వర్కర్ బాలనాగమ్మల కృషిని ప్రశంసిస్తూ, విద్యార్థుల ఆరోగ్యం కోసం చేస్తున్న సేవలు ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.



## మీడియా అకాడమీ ఛైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి పదవీకాలం పొడిగింపు

తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్‌గా కె. శ్రీనివాసరెడ్డి పదవీకాలం మరో రెండేళు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ 24తో ఆయన పదవీకాలం ముగిసింది. దీంతో కొత్తవారిని నియమిస్తారని అంతా అనుకున్నారు. కానీ ప్రభుత్వం తిరిగి శ్రీనివాసరెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో మరో రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. తన పదవీకాలం పొడిగించినందుకు ఆయన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## కలెక్టర్ ఆదేశాలతో పాల కేంద్రాలను తనిఖీ చేసిన ఏడి వెంకటేశ్వర్లు





**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 25:** బండి ఆత్మకూరు మండలంలోని పలు పాల కేంద్రాలను వెలుగోడు సబ్ డివిజన్ పశు సంవర్ధక శాఖ ఏడి ఆకుల వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. మూడు రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో కల్తీ పాలు తాగి చాలామంది వ్యక్తులు అనారోగ్యానికి గురి అయ్యారు. కల్తీ పాలను సేవించడం వల్ల చాలామంది పొత్తికడుపు నొప్పి మూత్రపిండాల వ్యాధులకు గురి కావడమే కాకుండా, వీరి రక్తంలో యూరియా క్రియాటిన్ అధికంగా ఉన్నట్లుగా నిర్ధారించారు. దీనితో ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకొని వెంటనే ఈ విషయంపై చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశాలకు జారీ చేశారు. పాల కేంద్రాలను పరిశీలించి తనిఖీలు చేపట్టి వెంటనే నివేదికలు పంపాలని కూడా కలెక్టర్ ఆదేశించడం జరిగింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడి వెంకటేశ్వర్లు భోజనం, పెద్ద దేవలాపురం గ్రామాలలోని పాల కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేపట్టారు. పాలలో వెన్న శాతాన్ని గురించి బిట్టో మీటర్ ద్వారా ఏడి వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. వినియోగదారులకు నిర్వాహకులు పాలు విక్రయించే పరిస్థితులలో అక్రమ పద్ధతులను అవలంబించరాదని, ప్రజలను మోసగించి కల్తీ పాలను తయారు చేసే అమ్మితే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఏడి హెచ్చరించారు . తర్వాత పెద్దదేవలాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఆ శాఖకు సంబంధించిన వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో పశుసంవర్ధక సహాయకురాలు జయశ్రీ కూడా ఉన్నారు.

## కల్తీ పాలు తాగడంవల్ల అనారోగ్యాలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 25:** కల్తీ పాలను తాగడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురి అవుతారని వెలుగోడు సబ్ డివిజన్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రాంతంలో మూడు రోజుల క్రితం కల్తీ పాలు తాగి చాలామంది వ్యక్తులు అస్వస్థతకు గురై అనారోగ్యాల పాలయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బండి ఆత్మకూరు మండలంలో పలు పాల కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లాభాలు ఆర్జించడం కోసం కొంతమంది వ్యక్తులు పాలలో కల్తీ మందులు అమ్మి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే అటువంటి వారిని గుర్తించి కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా డిటర్జెంట్ కాస్టిక్ సోడా హైడ్రోజన్ వంటి హానికరమైన రసాయనాలను పాలలో కలిపి అమ్మడం వల్ల కాలేయం మూతపిండ వ్యాధులు గ్యాస్ట్రో ఎంతరైటిస్ మరియు వాంతులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీయడమే కాకుండా కొన్నిసార్లు మరణాలు కూడా సంభవిస్తాయని అన్నారు. పాలలో కల్తీలను గురించి ఏడి మాట్లాడుతూ, పాలలో అధికంగా నీరు కలిపినట్లు అయితే ఒక ఏటవాలు ఉపరితలంపై ఒక చుక్క పాలు వేస్తే స్వచ్ఛమైన పాలు అయితే తెల్లటి గీతను వదులుతూ ప్రవహిస్తాయని అన్నారు అదే కల్తీ పాలు అయితే ఎలాంటి గుర్తు లేకుండా వేగంగా కిందికి జారిపోతాయని అన్నారు. పాలను చిన్న సీసాలో తీసుకొని బాగా కుదిపితే నురుగు ఎక్కువగా వస్తే డిటర్జెంట్ కల్తీ ఉన్నట్లుగా గుర్తించాలని అన్నారు. పాలలో యూరియా ఉంటే ఆ మిశ్రమం ఎరుపు రంగులోకి మారుతుందని పాలలో కొద్దిగా పసుపు కలిపితే ఆ పాలు ఎరుపు రంగులోకి మారితే బోరిక్ యాసిడ్ కలిపినట్లుగా నిర్ణయించుకోవాలన్నారు కల్తీ పాలు సాధారణ పాలకంటే తెల్లగా చిక్కగా ఉండటంతో పాటు ఎక్కువ నురగతో ఉంటాయని అన్నారు. ఈ పాలను పసిపిల్లలు తాగడం వల్ల జీర్ణకోశ వ్యాధులు ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయని ఎడి వెంకటేశ్వర్లు వివరించారు. ప్రజలు పాల కేంద్రాల వద్ద, ప్రైవేట్ వ్యక్తుల వద్ద పాలు తీసుకునే ముందు జాగ్రత్తలు పాటించి, కల్తీ లేని పాలను తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ అనుమతి లేని శ్రీ భాగ్యలక్ష్మి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి




**పోరుమామిళ్ల ఫిబ్రవరి 25 (నంది పత్రిక ):** కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలో ఎలాంటి ప్రభుత్వం అనుమతులు లేకుండా పాఠశాల శ్రీ భాగ్యలక్ష్మి పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని బుధవారం పోరుమామిళ్ల ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...** చదువు పేరుతో ప్రభుత్వ అనుమతి లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్న శ్రీ భాగ్యలక్ష్మి పాఠశాలను సీజ్ చేయాలని అలాగే ప్రస్తుతం ఉన్న పాఠశాల గతంలో కలసపాడు మండలంలోని మార్గదర్శి అనే విద్యా సంస్థతో గుర్తింపు చెందినది కానీ ఇప్పుడు వేరొక మండలం నుంచి పోరుమామిళ్ల పట్టణం పాఠశాల గుర్తింపుగా ఉంది అని విద్యార్థులను విద్యార్థుల,తల్లిదండ్రులను నమ్మించి అన్ని వసతులు ఉన్నాయని వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తూ వ్యాపారం చేస్తున్న పాఠశాల యాజమాన్యం పై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. అలాగే జిల్లాలోని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భాను ప్రకాష్ , నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాడిఎంకెతో సీట్ల పంపకాలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారంనాడు చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలకు బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళని స్వామి, సీనియర్ నేతలు పాల్గొనున్నారు. కాగా, 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు.

# మెదడులోని రక్తనాళాలకు అరుదైన శస్త్ర చికిత్స

- తీవ్రమైన తలనొప్పితో ఆస్పత్రికి వచ్చిన యువతి
- మెదడు చుట్టూ రక్తస్రావం సమస్య' గుర్తించిన వైద్యులు
- అత్యాధునిక పద్ధతిలో 6 గంటల పాటు ఆపరేషన్
- శస్త్ర చికిత్సతో నయం చేసిన 'కిమ్స్ కర్నూలు' డాక్టర్లు

**కర్నూలు, నంది పత్రిక.....**కర్నూలులోని కిమ్స్ ఆస్పత్రి డాక్టర్లు అరుదైన, అత్యంత సంక్లిష్టమైన మెదడు శస్త్ర చికిత్సను అధునాతన పద్ధతిలో విజయవంతంగా నిర్వహించారు. తీవ్రమైన తలనొప్పితో ఆస్పత్రికి వచ్చిన ఓ యువతికి ప్రాణాపాయానికి దారితీసే రక్తనాళ సమస్య ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను కిమ్స్ కర్నూలు ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. కె. అశోక్ రెడ్డి తెలిపారు. యువతి ఆస్పత్రికి వచ్చిన వెంటనే పరీక్షల్లో భాగంగా చేసిన సీటీ స్కాన్ చేశాం. సంబంధిత రిపోర్టులో మెదడు చుట్టూ రక్తస్రావం (సబ్ అరాక్నాయిడ్ హీమరేజ్ ఎస్ఏహెచ్) ఉన్నట్లు తేలింది. తదుపరి పరీక్షల్లో మెదడులో రక్తనాళాలు అసాధారణంగా చిక్కుకుని ఉండే 'ఆర్టీరియోవీనస్ మాల్ఫార్మేషన్' (ఏవీఎం) ఉన్నట్లు గుర్తించాం. ఆర్టీరియోవీనస్ మాల్ఫార్మేషన్ అంటే .. మెదడు లేదా శరీరంలోని ఇతర భాగాల్లో ధమనులు, సిరలు మధ్య సాధారణంగా ఉండే చిన్న రక్తనాళాలు లేకుండా, నేరుగా కలిసిపోవడం వల్ల ఏర్పడే అసాధారణ రక్తనాళాల ముడి. ఇది ఎప్పుడైనా పగిలి తీవ్ర రక్తస్రావానికి కారణమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ 'ఏవీఎం' నిర్మాణం క్లిష్టంగా ఉండటంతో సాధారణంగా ధమనుల ద్వారా చేసే చికిత్సలో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా. కె. అశోక్ రెడ్డి నేతృత్వంలోని న్యూరో ఇంటర్వెన్షన్ బృందం 'ట్రాన్స్‌వీనస్ ఎంబోలైజేషన్' అనే అరుదైన పద్ధతిలో చికిత్స చేయాలని నిర్ణయించుకున్నాం. ఇందులో ధమనుల మార్గం కాకుండా, రక్తం బయటకు వెళ్లే సిర ద్వారా అసాధారణ రక్తనాళాలను మూసివేసి చికిత్స అందిస్తారు. ఇది సాంకేతికంగా చాలా క్లిష్టమైన విధానం. ఈ విధానం దేశంలో చాలా కొద్దిచోట్ల మాత్రమే చేస్తారు. ఓపెన్ బ్రెయిన్ సర్జరీ చేయకుండా, ఒక్క



సెషన్‌లోనే మొత్తం అసాధారణ రక్తనాళాల వలయాన్ని విజయవంతంగా మూసివేశాం. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం బాగా మెరుగుపడింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉంది. ' అని డాక్టర్ కె. అశోక్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, "ఆధునిక ఎండోవాస్క్యులర్ పద్ధతులతో క్లిష్టమైన మెదడు రక్తనాళ లోపాలను తక్కువ గాయం కలిగించే విధంగా చికిత్స చేయగలుగుతున్నాం. ప్రారంభ దశలోనే గుర్తించి, వెంటనే చికిత్స చేయడం వల్ల పెద్ద సమస్యలను నివారించవచ్చు" అని తెలిపారు. ఈ చికిత్స విజయవంతం కావడంలో న్యూరో ఇంటర్వెన్షన్, న్యూరాలజీ, అనస్థీషియా మరియు క్రిటికల్ కేర్ బృందాల సమన్వయం కీలక పాత్ర పోషించిందని ఆసుపత్రి యాజమాన్యం అభినందించింది. ఇలాంటి సమస్యలకు ఇంతకుముందైతే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై లాంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు కిమ్స్ కర్నూలు ఆస్పత్రిలో అత్యంత నిపుణులైన వైద్యబృందం ఉండడంతో పాటు అత్యాధునిక సదుపాయాలు కూడా అందుబాటులో ఉండడంతో ఎలాంటి సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సలైనా ఇక్కడే చేసే వీలుంది. అందువల్ల కర్నూలు తో పాటు రాయలసీమ జిల్లాల్లో కూడా ఇలాంటి ప్రధాన సమస్యలకు ఇక్కడే చికిత్స పొందొచ్చు" అని డాక్టర్ అశోక్ రెడ్డి వివరించారు.

# 2020 బ్యాచ్ ఎంబిబిఎస్ విద్యార్థుల రక్తదానం"..



**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు మెడకి కాలేజీలో 2020లో ఎంబిబిఎస్ అడ్మిషన్ పొంది వైద్య విద్యను పూర్తి చేసి త్వరలో మెడిషన్ పట్టా తీసుకుంటున్న సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ఏ డి ఎం ఈ & మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ అన్నారు. బుధవారం కర్నూల్ మెడికల్ కాలేజీలో రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు వైద్యంతో ప్రాణాలు కాపాడడమే కాకుండా రక్తదానంతో కూడా ప్రాణాలు కాపాడడానికి ముందుకు రావడం ప్రతి వైద్య విద్యార్థి ఇలాంటి సంప్రదాయాన్ని పాటించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ వైద్య శిబిరంలో 2026 ఔట్గోయింగ్ బ్యాచ్ అశోక అశోక హచ్ -26 పేరుతో త్వరలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించుకోబోతుంది. ఈ రక్తదాన శిబిరమును జిజిహెచ్ గవర్నమెంట్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా షెహానాజ్, పేథాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డా.శైల, 2ని 20 బ్యాచ్ సి ఆర్ డా.అభిషేక్, అఖిల్, శిరీష, స్వర్ణలత, ప్రవల్లిక, హరినాథ్, జైషన్, బాలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు ను అరికట్టి, వాటిని అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి - ఏఐవైఎఫ్



**కర్నూలు నంది పత్రిక.....** ఆదోని పట్టణం మరియు పరిసర గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా కల్తీ కల్లు డిపోలు నిర్వహిస్తూ అనేక కల్లు దుకాణాలకు కల్తీ కల్లు సరఫరా చేస్తున్న వారిపై చర్య తీసుకోని, కల్తీ కల్లు నుండి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ సుధీర్ బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, మాట్లాడుతూ ఆదోని పట్టణ శివారులో అక్రమార్కులు చట్టబద్ధ అనుమతులు లేకుండా కల్తీ కల్లు డిపో ఏర్పాటు చేసి కల్లు విక్రయిస్తున్నారని, దీనివల్ల పేద మరియు కూలీ వర్గాల ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతూ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని ఆయన విమర్శించారు. గతంలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఘటనల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా, ఇదే పరిస్థితి ఆదోనిలో పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కల్తీకల్లు అరికట్టే ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానిక ఎక్స్ఛేంజ్& ప్రొహిబిషన్ అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని కావున ఇలాంటి వాటిపై ప్రత్యక్ష దాడులు నిర్వహించి కల్తీకల్లు అరికట్టడమే కాకుండా వాటి నిర్వహిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసి కల్తీకలనుండి ప్రజల ప్రాణాలు కాపాడాలని వారి డిమాండ్ చేశారు అలా కాను పక్షంలో ఏ ఐ వై ఎఫ్ గా కల్తీ కళ్ళు దుకాణాలపై ప్రత్యక్ష దాడులు నిర్వహిస్తామని దానికి ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించవలసి వస్తుందని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఆదోని పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రమేష్, అజిత్, కర్నూల్ నగర అధ్యక్షులు నాగరాజు, నగర నాయకులు కళాఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్.గురు రాజు ను కలిసిన ఎంపీ నాగరాజు



**కర్నూలు నంది పత్రిక.....** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత సన్నిహితుడు మరియు ఆయన వ్యక్తిగత వైద్యుడైన డాక్టర్.గురురాజును ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు...విజయవాడ లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు...ఈ సందర్భంగా గురు రాజు తో జిల్లాలోని పలు రాజకీయ అంశాలతో పాటు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై ఎంపీ నాగరాజు చర్చించారు...

# దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధూపదీప పూజా సామాగ్రి పంపిణీ.




**సిరివెళ్ల (నంది పత్రిక)** శిరివెళ్ల మండల పరిధిలోని పలు హిందూ దేవాలయాలను గుర్తించి దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం ధూప దీపం వెలగాలన్న సదుద్దేశంతో దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఏ నాగమల్లేశ్వరారెడ్డి ధూప దీప పూజా సామాగ్రిని బుధవారం పంపిణీ చేశారు . ఈ సందర్భంగా నాగ మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుండి దాతల సహకారంతో ఆంధ్రప్రదేశ్లో ఐదువేల దేవాలయాలకు దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దూప దీప పూజా సామాగ్రిని అందించడం జరుగుతున్నదన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగానే ఈమాసంలో కూడా దానాధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిరివెళ్ల మండలంలోని కొన్ని దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. గత ఏడు సంవత్సరాలు నుండి సుమారు 5000 దేవాలయాలకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గత సంవత్సరం శిరివెళ్ల మండలంలో దాదాపుగా 70 దేవాలయాలకు కార్తీకమాస సందర్భంగా ధూపదీప పూజా సామాగ్రి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి...






**కఠినంగా వ్యవహరించాలి**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ .**

**డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ చేయించాలి.**

**అసాంఘిక కార్యకలపాల పై నిఘా ఉంచాలి .**

**డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, గంజాయి అక్రమ రవాణా పై ప్రత్యేక దృష్టి సారించాలి .**

**విజిబుల్ పోలీసింగ్ ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.**

**ఫిర్యాదుల పై సత్వరమే స్పందించాలి**

**పోలీసు అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశం .**

**కర్నూలు నంది పత్రిక...** జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సంధర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. కర్నూలు ఎస్పీ పోలీసు అధికారులతో మాట్లాడుతూ...విజిబుల్ పోలీసింగ్ ఎక్కువగా చేయాలన్నారు. పోలీసు స్టేషన్ల ను ఆశ్రయించే బాధితుల ఫిర్యాదుల సమస్యల పై సత్వరమే స్పందించి న్యాయం చేయాలన్నారు. నేర నివారణే ప్రథమ లక్ష్యంగా పని చేస్తనే పోలీసు శాఖ కు మంచి పేరు వస్తుందన్నారు. కార్డన్ సెర్చ్ లు, రాత్రి గస్తీలు, రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్, పల్లె నిద్ర కార్యక్రమాలు, గ్రామాల సందర్శనలు, ఆకస్మిక తనిఖీలు, బైండోవర్ లు, పిడి యాక్టులు నమోదు చేయాలన్నారు. ప్రజా శాంతికి భంగం కలిగించే వారి పై జిల్లా బహిష్కరణలు, పిడి యాక్టులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు, చీటింగ్ కేసులు, దొంగతనాల కేసులు, ప్రాపర్టీ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే పెట్రోలింగ్ వాహనాలతో సైరన్స్, లౌడ్ స్పీకర్లతో హెచ్చరికలు జారీ చేయాలన్నారు. దొంగతనాలు, ప్రాపర్టీ కేసులు చేధించి , రికవరీలు పెంచాలన్నారు. పోక్సో కేసులలో ఖచ్చితంగా నిర్దేశించిన సమయంలోపే ఛార్జ్ షీట్ వేయాలన్నారు .డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై స్పెషల్ డ్రైవ్ చేపట్టి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా ప్రతి ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేయాలన్నారు.

**డీజీపీ చేపట్టిన " వజ్ర ప్రహార్ " కార్యక్రమంలో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు.** రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణ పై నిఘా ఉంచాలన్నారు. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకు విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. ప్రతి సబ్ డివిజన్ లలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు చేయాలన్నారు. డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ చేయించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడి బాధితులు లక్షలలో డబ్బులు పోగోట్టుకున్నట్లు ఫిర్యాదులు వస్తే సైబర్ క్రైమ్ క్రింద వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో సిసియస్ పోలీసులు బాగా పని చేయాలన్నారు. నేర చరిత్ర, చెడు ప్రవర్తన ఉన్న వారి పై ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులను నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తులను పకడ్బందీగా చేయించాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలోని జాతీయ రహదారుల పై టోల్ గేట్స్ వద్ద, ముఖ్యమైన ప్రాంతాలలో అర్ధరాత్రి దాటాక హెవీ వెహికిల్స్ డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లకుండా వారి ముఖాలు నీళ్లతో కడిగిస్తూ స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాలను బాగా చేయాలన్నారు.అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ...గస్తీ తిరిగే పోలీసులు రాత్రివేళల్లో రేడియం జాకెట్స్ , ఎల్ ఈ డి బ్యాటన్స్ ధరించాలన్నారు. గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి, మరియు డిపిఓ మినిస్టిరియల్ సిబ్బందికి ఎస్పీ గారు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్ , వెంకట్రామయ్య , ఉపేంద్రబాబు, హేమలత, భార్గవి , డిపిఓ ఎఓ విజయలక్ష్మీ, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

**జిల్లా కలెక్టర్ & జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిట**

**ీ చైర్మన్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 25(నంది పత్రిక):-** 2026 -27 సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి. రాజకుమారి బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశంలో ఆమోదం పొందిన మొత్తం 508 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మిగిలిన పాత్రికేయుల అర్హతలను పరిశీలించి, తదుపరి కమిటీ సమావేశంలో వారికి కూడా మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి జాబితాలో ఆమోదం పొందిన పాత్రికేయులు సంబంధిత డీఐపీఆర్ఓ కార్యాలయం నుండి తమ అక్రిడిటేషన్ కార్డులను స్వీకరించి, ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐపీఆర్ఓ, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సోలార్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలి



## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఫిబ్రవరి 25(నంది పత్రిక):-** జిల్లాలో అమలులో ఉన్న సోలార్ విద్యుత్ పథకాల పురోగతిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, సోలార్ వెండర్లతో కలిసి వివిధ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పీఎం-కుసుమ్-సి పథకం కింద జిల్లాలో చేపట్టిన 9 పనులలో 4 పనులకు ఇప్పటికే స్థలాలు ఖరారు చేసామని మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరారైన 4 పనులకు తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతులకు పగటి పూట నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 117 ఎకరాల విస్తీర్ణంలో 29 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి 'వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'కు లెటర్ ఆఫ్ అవార్డ్ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,595 వ్యవసాయ పంప్‌సెట్లకు నిరంతర సౌర విద్యుత్ సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**పీఎం సూర్యఘర్ & రూఫ్‌టాప్ సోలార్** పీఎం సూర్య ఘర్ మఫ్ట్ బిజిలి యోజన మరియు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు కేటాయించిన రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని వెండర్లను ఆదేశించారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సిబ్బంది, సోలార్ వెండర్లు సంయుక్తంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలు, బ్యాంకు రుణ సౌకర్యాల వివరాలను వినియోగదారులకు స్పష్టంగా తెలియజేసి రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్టుల సమర్థ అమలుతో రైతులు, గృహ వినియోగదారులు తక్కువ ఖర్చుతో పునరుత్పాదక శక్తి ఆధారిత నాణ్యమైన విద్యుత్‌ను పొందగలరని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు శాశ్వత విద్యుత్ పరిష్కారాల దిశగా జిల్లా ముందంజలో నిలవాలని ఆమె ఆకాంక్షించారు.



# లక్ష్యానికి చేరువలో ఏకీకృత సర్వే



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 25 :** అర్హత కలిగిన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రారంభమైన ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే లక్ష్యానికి చేరువలో ఉంది. 2025 డిసెంబర్ నెల 14వ తేదీన ఈ ఏకీకృత సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. సర్వేకు సంబంధించి సాఫ్ట్వేర్ సిస్టం అప్లోడ్ అయ్యేందుకు 20 రోజుల జాతకం ఏర్పడడంతో జనవరి నెలలో సర్వే ప్రారంభమైంది. బండి ఆత్మకూరు మండలంలో దాదాపు 245 క్లస్టర్లు ఉండగా 16, వేల 40 ఇల్లు ఉన్నాయి. వీటిలో 14098 ఇళ్లకు సంబంధించి సర్వే పూర్తి అయింది. 1942 ఇళ్లకు సర్వే పూర్తి చేయాల్సి ఉంది. జి లింగాపురంలో 425 ఈర్లపాడులో 247, బండి ఆత్మకూరు ఒకటి సచివాలయంలో 232 ఇళ్లకు సంబంధించి సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటికే మండలంలో 88% సర్వే పూర్తికాగా 12 శాతం అసంపూర్తిగా ఉంది. ఏకీకృత సర్వేలో రాష్ట్రంలోనే నంద్యాల జిల్లా టాప్ టూ లో ఉండగా, బండి ఆత్మకూరు మండలం 13వ స్థానంలో ఉందని తెలుస్తోంది. ఏకీకృత సర్వే నిర్వహణలో సచివాలయ సిబ్బంది పడుతున్న ఇబ్బందులు చాలా ఉన్నాయి. సిస్టం పనిచేయక గంటలు తరబడి కుటుంబాల ఇళ్ల వద్దే సిబ్బంది తీస్తే వేసి కూర్చోవాల్సిన పరిస్థితులు కూడా నెలకొని ఉన్నాయి. ఒక్కో ఇంటి వద్ద సర్వే నిర్వహించేందుకు దాదాపు అరగంట సమయం పడుతూ ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సర్వే పూర్తి కాకపోవడంతో ఒకటికి రెండుసార్లు అధికారులు సర్వే విధానాన్ని పొడిగించారు. ఈ విషయంలో సచివాలయ సిబ్బంది అధికారుల నుండి చివాట్లు తినాల్సి వచ్చింది. ఫిబ్రవరి 28 నాటికి సర్వే పూర్తి చేయాలని అధికారులు కంకణం కట్టుకొని పనిచేస్తున్నారు.

# నంద్యాలలో గంజాయి అక్రమ రవాణా..

## ఇద్దరు అరెస్ట్, 2 కిలోల గంజాయి స్వాధీనం

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి25(నంది పత్రిక):-** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము గాంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో భాగముగా ప్రతిష్టాత్మకముగా చేపట్టిన ఆపరేషన్ "వజ్ర ప్రహార్" అను కార్యక్రమములో భాగముగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, నంద్యాల ఎస్ డి పి ఓ ఎం.జావళి పర్యవేక్షణలో, నంద్యాల జిల్లా, నంద్యాల 1 టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ వారి సిబ్బంది కలిసి, విశ్వసనీయ సమాచారం ఆధారంగా నంద్యాల టౌన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి, వారిని అరెస్టు చేసి, వారి నుండి సుమారు 2 కేజి ల గంజాయిని మరియు రెండు సెల్ ఫోన్ లను స్వాధీనము చేసుకోడమయినది. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి ఉంచాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు ఎం.జావళి ఆల్ఫోన్స్ పర్యవేక్షణలో 24.02.2026 తేదీ సాయంత్రం 17.00 గంటలకు నంద్యాల టౌన్ జగజ్జనని నగర్, చెరువుకట్ట , మల్లెలమ్మ గుడి వెనుక ప్రాంతంలో దాడి నిర్వహించగా దాసరి కళ్యాణ్ (22 సం.), తండ్రి వెంకటేశ్వర్లు, నివాసం: బైటిపేట, ప్రస్తుతం నందమూరి నగర్, నంద్యాల మండలంమాందాపురం మనోహర్ (23 సం.), తండ్రి లేట్ నరసింహుడు, నివాసం: బైటిపేట, నంద్యాలఅను వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు 2 కిలోల గంజాయి మరియు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడమైనది. వారి ఇద్దరిలో ఒకరైన దాసరి కళ్యాణ్ పై గతంలో సారాయి కేసు కూడా వున్నది. గత కొద్ది రోజుల క్రితము నుండి వారు మద్యం త్రాగడము మరియు గంజాయి ఇతర చెడు అలవాట్లకు లోనై, జల్సాలు చేస్తూ, గంజాయి సేవిస్తూ తిరుగుతూ ఉండేవారు. ఆ క్రమములో వారు అప్పుడప్పుడు గంజాయి కోసం వైజాగ్ దగ్గర గల అరకుకు వెళ్ళి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కేజీ 4 వేల రూపాయలకు కొనుగోలు చేసి నంద్యాలకు తెచ్చుకొని వారు ఇద్దరు సమానముగా గంజాయి పంచుకొని, ఇక్కడ 10 గ్రాముల ప్రకారము చిన్న చిన్న ప్యాకెట్స్ గా తయారు చేసి, 100 గ్రాముల ప్యాకెట్ సుమారు =ం 2000/- రూపాయల చొప్పున అధిక లాభము వచ్చేలా నంద్యాల టౌన్ లో కాలేజీ విద్యార్థులకు, సాధువులకు మరియు నంద్యాల టౌన్ లో అక్కడక్కడ గంజాయికి అలవాటు పడిన వ్యక్తులకు అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు.గంజాయి విక్రయాన్ని అడ్డుకుని నిందితులను పక్క సమాచారంతో పట్టుకున్న నంద్యాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డిని, వారి సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



**ప్రజలకు, విద్యార్థులకి పోలీసుల శాఖ తరుపున సందేశం**: గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా మరియు విక్రయం చట్టవిరుద్ధం.మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయి.అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. ఇంటర్, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కాలేజ్ ల యాజమాన్యాలు వారి వారి విద్యార్థులకి తరచుగా మత్తు పదార్థాల పట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలి. మాదకద్రవ్య రహిత సమాజం కోసం పోలీసులతో కలిసి ముందుకు రండి." అని తెలిపారు.

# స్వచ్ఛ నగరానికి ప్రజల భాగస్వామ్యం కీలకం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

### రహదారులపై చెత్త వేస్తే సోషల్ మీడియాలో వైరల్

**కర్నూలు నంది పత్రిక.....** స్వచ్ఛ నగర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కీలకమని నగరపాలక సంస్థ పిలుపునిచ్చారు. నగరాన్ని స్వచ్ఛతలో ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో రహదారులు, గార్బేజ్ పాయింట్ల వద్ద పర్యవేక్షణను కట్టుదిట్టం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు బాధ్యతారాహిత్యంగా రోడ్లపై చెత్త వేయకుండా ఉండేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచినట్లు తెలిపారు.చెత్త వేస్తున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కిన వెంటనే వాటిని సోషల్ మీడియాలో విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సంబంధిత వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు బాధ్యులపై జరిమానాలు విధించే చర్యలు చేపడుతామని వెల్లడించారు. నగర పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చెత్తను నగరపాలక వాహనాలకే ఇవ్వాలని కోరారు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛ కర్నూలు లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి.

### కమిషనర్ ఎన్.మౌర్య.



**తిరుపతి చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25 నంది పత్రిక** అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాధ్యాహ్నం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు. వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.



# జర్నలిస్టులకు 10 లక్షల ప్రమాద బీమా బాండ్లు పంపిణీ.



**కర్నూలు నంది పత్రిక......** కర్నూల్ నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు 10 లక్షల ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేయడం జరిగిందని యునైటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నాగార్జున రెడ్డి తెలిపారు. ఈరోజు కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోనే నీ సమాచార పౌర సంబంధాల శాఖ భవనంలో జర్నలిస్టులకు 10 లక్షల ప్రమాద బీమా బాండ్లను జర్నలిస్టులు మీసాల రామస్వామి వల్లి రంగా జాకీర్ ,శీను ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జర్నలిస్టులు అకాల మృతి సంఘటనలు అధికమయ్యాయి అని, ఇలాంటి ప్రమాద బీమా జర్నలిస్టులకు ఉపశమనం కలుగుతుందని చెప్పారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, 15 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని, ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టాలని, రైల్వే పాసులు పునరుద్ధరించాలని యూట్యూబ్ న్యూస్ ఛానల్ కు జిల్లాకు పది అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించాలని జర్నలిస్టులు కోరారు, ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఈవెంట్లలో ప్రతిభ చూపిన కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి




**కుప్పం (నంది పత్రిక ) ఫిబ్రవరి 25 :** కుప్పం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి భువనేశ్వరన్ రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారని చైర్మన్ డాక్టర్ బి సి నాగరాజ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియా ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026" లో తమ విద్యార్థి పాల్గొని కృత్రిమ మేధస్సు రంగంలో తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారన్నారు. అదేవిధంగా చెన్నైలోని ఐఐటీఎం రీసెర్చ్ పార్క్ లో నిర్వహించిన ది కాటలిస్ట్ 2026 ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ కమర్షియలైజేషన్"కార్యక్రమంలో తన వినూత్న అగ్రి-టెక్ ప్రోటోటైప్ ఫార్మ్ కాల్ ను ప్రదర్శించేందుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే ఫార్మ కాల్ ప్రాజెక్ట్ వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించి రైతులకు సమయానుకూల సమాచారం, సలహాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. బి. సి. నాగరాజ్, వైస్ చైర్మన్ డా. ఎన్. సునీల్ రాజ్, ప్రిన్సిపల్ డా. ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డా. ఎస్. బాస్కరన్, విభాగాధిపతి లిడా. కె. లోగేష్, అధ్యాపకులు భువనేశ్వరన్‌ను అభినందించి, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

# హైకోర్టులో ఐపిఎస్ అధికారి నాయక్ ముందస్తు బెయిల్

ఏపీ హైకోర్టులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ బుధవారం ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సునీల్ నాయక్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. రఘురామ అరెస్ట్ సమయంలో ఏపీ సీఐడీ ఎస్పీగా ఆయన ఉన్నారు. రెండు రోజుల క్రితం సునీల్ నాయక్‌ను అరెస్ట్ చేసేందుకు ఎస్పీ దామోదర్ బిహార్ వెళ్లారు. ఈ క్రమంలోనే ట్రాన్సిట్ వారెంట్ ఇచ్చేందుకు నిరాకరించింది బిహార్ కోర్టు. దీంతో ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు సునీల్ నాయక్. ముందస్తు బెయిల్ పిటిషన్ రేపు(గురువారం) విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# బడికోసం మాస్టారు కృషి అభినందనీయం

### మంత్రి లోకేశ్ ప్రశంసలు

కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం సగరపేటలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పీవీవీ. సత్యనారాయణ మాస్టారు బడి బాగు కోసం చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. సొంత నిధులు దాదాపు రూ.10 లక్షలు, దాతల విరాళాలు రూ.1.80 లక్షలతో కార్పొరేట్ స్కూలుని తలదన్నేలా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. క్లాసు రూమ్‌లో టైల్స్, గ్రౌండ్ ఫ్లోరింగ్, పెయింటింగ్, వాల్ రైటింగ్, కాంపౌండ్ వాల్ రంగులతో కొత్తందాలు సంతరించుకునేలా చేశారని కీర్తించారు. నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్ రూం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయుల సహకారంతో వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్ అన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహాయం అందిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# బ్యాంక్‌లకు ఎగవేత కేసు

### అనిల్ అంబానీ నివాసం జప్తు

రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్' ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పాలిహిల్ ప్రాంతంలో ఉన్న ఈ భవనం 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇంతవరకూ జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది.

# ఆళ్లగడ్డలో మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు విజయవంతం

### అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఉద్యమశీ ఆగదు
### సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 25 నంది పత్రిక:** అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం ముగిశాయి. ఆళ్లగడ్డ ప్రాజెక్టు సిడిపిఓ కార్యాలయం ముందు జరిగిన ముగింపు శిబిరానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసు రత్నం, సిఐటియు ఆళ్లగడ్డ ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, అంగన్వాడి జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల, జిల్లా ప్రధాన అధ్యక్షులు షేబా హాజరయ్యారు. ఆళ్లగడ్డ ప్రాజెక్టు అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వేతనాలు పెంపుదల చేయాలని పోరాటం చేస్తున్న అంగన్వాడీ కార్మికులకు పాలకులు అన్యాయం చేస్తున్నారన్నారు. అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసం రూ .26,000 వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్ లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటి అమలకు గైడ్లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్ రూరల్ తేడా లేకుండా అందరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించి అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మే నెల అంతా వేసవి సెలవుల జీఓ విడుదల చేయాలని, లబ్ధిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు, క్వాంటిటీ పెంచి మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫ్రీ స్కూల్ బలోపేతం చేసి ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడి సెంటర్లో ఉంచే విధంగా జీవో ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంపుదలపై దృష్టి కేంద్రీకరించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. గత సమ్మెకాలంలో ఎన్ని నిర్బంధాలు పెట్టిన లాఠి చార్జీలు చేసిన,ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ముందు నిలిచిన అంగన్వాడీలకు ఈ ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్టు ఇచ్చి ఇప్పుడు విస్మరించడం తగదు అన్నారు. ఈనెల 26, 27 తేదీలలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు, మార్చి 2న చలో విజయవాడ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



# ఆర్ యూ లో నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి కి కృతజ్ఞతలు తెలిపిన పిజి విద్యార్థులు






### పునర్వికకు పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ బైరెడ్డి శబరి
### పీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 50 లక్షలు ఆర్థిక సహాయం అందజేత
### రాయలసీమ ఉద్యమ యువ నాయకులు సీమ కృష్ణ రాథోడ్

**కర్నూలు నంది పత్రిక......**రాయలసీమ విశ్వవిద్యాలయంలో పీజీ విద్యార్థుల ఆధ్వర్యంలో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కి బుధవారం కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు మరియు రాయలసీమ ఉద్యమ యువ నాయకులు సీమ కృష్ణ రాథోడ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన రెండు సంవత్సరాల గల పునర్వికకు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారి తల్లిదండ్రులు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని ఆశ్రయించడంతో మానవతా దృక్పథంతో పిఎం రిలీఫ్ ఫండ్ నుంచి 50 లక్షల రూపాయలను పునర్విక వైద్య ఖర్చుల నిమిత్తం అందజేయడం జరిగిందన్నారు. మానవతా దృక్పథం చూపించిన

నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరికి యూనివర్సిటీ పిజి విద్యార్థుల ఆధ్వర్యంలో థ్యాంక్యూ బైరెడ్డి శబరి అక్క కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు సేవా గణేష్ నాయక్ సన్ని, ప్రేమ కుమార్, మహేంద్ర మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక.....** ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.బుదవారం ఉపాధి హామీ కింద జరుగుతున్న పనుల పురోగతి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా జిల్లాలో మొత్తం 704 పనులు, 72.69 కోట్ల రూపాయల అంచనాతో మంజూరయ్యాయని, ఇందులో 634 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. ఇంకా 70 పనులు ప్రారంభం కావాల్సి ఉందని, వీటిని ఈ శనివారం లోపు ప్రారంభించాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఎస్ఈ ని ఆదేశించారు. కృష్ణగిరి మండలంలో 17 పనులు మంజూరు కాగా, 2 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయని, మిగిలిన పనులను శనివారం లోపు ప్రారంభించాలని కలెక్టర్



పంచాయతీ రాజ్ ఇంజినీర్ ను ఆదేశించారు. అదే విధంగా పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. నిరక్షరాస్యులైన మహిళల కోసం నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో ద్వారా మొత్తం 8 పాఠాలు ఉండగా, ఇప్పటికే 7 పాఠాలు పూర్తయ్యాయని. మిగిలిన ఒక పాఠాన్ని మరియు రెండు వర్క్‌షీట్లను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 15 వ తేదీన నిర్వహించబోయే పరీక్షకు 1,61,000 మంది అభ్యాసకులు తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలోని కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం లేదా పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా గుర్తించి, ఇన్విజిలేటర్లుగా పాఠశాల ఉపాధ్యాయులను లేదా అంగన్‌వాడీ టీచర్లను నియమించాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిడి డిఆర్డిఏ, పిడి మెప్మా, డీఈవో మరియు ఇతర సిబ్బంది అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ , ఎంపిడిఓ లను ఆదేశించారు. కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్ లో ఎక్కువ శాతం పెండింగ్ ఉందని సర్వే లో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ సంబంధిత మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. పి-4 కార్యక్రమం కింద నమోదైన బంగారు కుటుంబాలలో పెండింగ్ లో ఉన్న కుటుంబాల వెరిఫికేషన్ ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా ఇంచార్జి పిడి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలతోనే ఉద్యోగావకాశాలు ప్రధానోపాధ్యాయులు - వీర రాఘవయ్య



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 25 మంది పత్రిక**

విద్యార్థులు వివిధ కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, నైపుణ్యాలతోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆళ్లగడ్డ నందు 9, 10 తరగతు లకు సంబంధించి వృత్తి విద్యాకోర్సు అభ్యసిస్తున్న దాదాపు 450 కి పైగా విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని చింతకుంట్ల దగ్గరలో ఉన్న వ్యవసాయ పనిముట్ల పరిశ్రమ వి ఆర్ ఆగ్రో ను సందర్శించి అందులో వ్యవసాయ పనిముట్లు ఏ విధంగా తయారవుతున్నది వాటిని ఏ విధంగా ఉపయోగిస్తారో వాటి గురించి చక్కగా నేర్చుకున్నారు. ఒకేష నల్ ఉపాధ్యాయులు అశోక్ మరియు అక్బర్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.




# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమం



**బద్వేల్ ఫిబ్రవరి 25 (నంది పత్రిక ):**బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ రమేష్ బాబు హాజరై క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ, సమాజంలో క్యాన్సర్ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రతి ఆరోగ్య సిబ్బంది దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే పూర్తిగా నయమయ్యే అవకాశముందని ప్రజలకు భరోసా కల్పించాలన్నారు.క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తించి ప్రజలకు తెలియజేయాలని, ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ప్రారంభ దశలో ఉన్న క్యాన్సర్‌కు శస్త్రచికిత్స ద్వారానే పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు.సమాజంలోని ప్రజలకు మెడికవర్ ఆసుపత్రి ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బద్వేల్ పట్టణ పరిసర ప్రాంత ప్రజల కోసం ప్రతి నెల మొదటి శనివారం బద్వేల్‌లోని సంజీవిని హాస్పిటల్‌లో డాక్టర్ రమేష్ అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఆడవారిలో నోటి క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌కు, అలాగే మగవారిలో నోటి క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్ వంటి వ్యాధులకు స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జె. జనార్దన్ రావు, మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



# రెవెన్యూ సమస్యల పరిష్కారం పై మనసుపెట్టి పని చేయండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి..





**వై ఎస్ ఆర్ కడప చీఫ్ బ్యూరో,ఫిబ్రవరి 25: నంది పత్రిక** రెవెన్యూ సమస్యల పరిష్కారం పై అధికారులు మనసుపెట్టి పని చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సభా భవన్ నందు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడుతో కలసి రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప,జమ్మల మడుగు, బద్వేలు,పులివెందుల ఆర్ డి ఓ లు జాన్ ఎర్విన్,సాయి శ్రీ, చంద్రమోహన్,చిన్నయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శాంతరాజ్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్ లతో రెవిన్యూ సంబంధిత అంశాలైన 22-ఏ,మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్, 22 రెవెన్యూ సంబంధిత అంశాలపై మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ ద్వారా పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు

# అటెండర్ మాదం బాబు మృతి:

### నివాళులు అర్పించిన సర్పంచ్ సత్తార్ ప్రతాప్ రెడ్డి

**శిరివేళ్ళ:(నంది పత్రిక);** సిరివెళ్ల మండలం పరిధిలోని యర్రగుంట్ల గ్రామ పంచాయతీలో ఇటీవల పనిచేసిన ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన అటెండర్ బాబు నిన్న సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామ సర్పంచ్ సత్తార్ ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సలాం, ఈఓపి ఆర్ డి వెంకటేశ్వర్లు, పోలా సుబ్బరాయుడు ఆళ్లగడ్డకు చేరుకొని బాబు మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్ని విధాల సహాయ సహకారం అందిస్తామని భరోసా ఇస్తూ సానుభూతి తెలియజేశారు అనంతరం వారు మాట్లాడుతూ వృత్తిపరంగా., నిబద్ధత కలిగిన వ్యక్తి అని కోల్పోవడం బాధాకరమని సత్తార్ ప్రతాప్ రెడ్డి అన్నారు.



# శనగ రైతులకు క్వింటా రూ.5,875 మద్దతు ధర దళారులను నమ్మి మోసపోవద్దు.





## ఆలూరు మండలంలో మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

**కర్నూలు, నంది పత్రిక.....** శనగ పంటను పండించిన రైతులకు ప్రభుత్వం క్వింటా కు రూ.5,875 మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు.మంగళవారం ఆలూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శనగ మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియ, తూకం, రికార్డుల నిర్వహణ, రైతుల సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్...శనగ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 252 మంది రైతులు శనగ అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకుని ప్రభుత్వ మద్దతు ధర ప్రయోజనం పొందాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. దళారులను నమ్మి తక్కువ ధరకు పంట అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని రైతులకు జేసీ తెలిపారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత వ్యవసాయ శాఖ లేదా కొనుగోలు కేంద్ర అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈకార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, తహసిల్దార్ శోభా సువర్ణమ్మ, వ్యవసాయ అధికారి వెంకటేష్ గౌడ్, సంబంధిత శాఖాధికారులు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాటర్ బాడీస్ (నీటి వనరులు, చెరువులు)లో ఆక్రమణలు ఉండకూడదు

## జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్






**కర్నూలు, నంది పత్రిక.....**వాటర్ బాడీస్ (నీటి వనరులు, చెరువులు)లో ఆక్రమణలు ఉండకూడదని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు..బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నీటి వనరులు మరియు చెరువు ల ఆక్రమణ లకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు..ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ బాడీస్ లో ఆక్రమణలు ఏమైనా జరిగినట్లయితే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.... ఆక్రమణలు ఏమైనా జరుగుతున్నట్లయితే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.. ఆక్రమణ లకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశం లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిపిఓ భాస్కర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కర్నూలు అర్బన్ తహసిల్దార్ రవి, కర్నూలు రూరల్ తహసిల్దార్ రమేష్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు..

# కోర్టు కేసులు వేగంగా పరిష్కారానికి చర్యలు

## కోర్టు కేసుల సమీక్షలో కమిషనర్ పి.విశ్వనాథ్

## న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులపై సమీక్ష



**కర్నూలు నంది పత్రిక......** నగరపాలక సంస్థకు సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు వేగంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కోర్టు కేసుల స్థితిగతులపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, పిటిషన దారులు, న్యాయవాదులతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పరిష్కారించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కౌంటర్ల దాఖలు, న్యాయస్థానాల ఆదేశాల అమలు వంటి ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, ఇంచార్జి సిటీ వై.వెంకటరమణ, లీగల్ అడ్వైజర్ కృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, నాగరాజు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల వద్ద సీసీ కెమెరాలు

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 25:** రైతు కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎత్తిపోతల పథకాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు నీటిపారుదల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్ రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీని టెక్నికల్ అసిస్టెంట్ సాంబశివుడు పరమటూరు ఎత్తిపోతల నీటి పథకాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులకు బుధవారం సాయంత్రం అందజేశారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎత్తిపోతల నీటి పథకాలకు సంబంధించిన విద్యుత్ మోటార్లు, పైపులైన్లు చోరీకి గురి అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ముందు జాగ్రత్త చర్యగా రైతు కమిటీలు నీటి పథకాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కమిటీలకు ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్నారు. ఎక్కడైనా చోరీలు జరుగుతే అందుకు కమిటీలే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఎత్తిపోత పథకాల నిర్వహణలో బాధ్యతారాహితంగా వ్యవహరిస్తే ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుసరించి తీసుకునే చర్యలకు కమిటీలు బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు.



# విద్యుత్ విభాగం సహకారంతో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ

## ఎలక్ట్రానిక్స్ కోర్సులో భాగంగా సబ్ స్టేషన్ సందర్శన




**పోరుమామిళ్ల ఫిబ్రవరి 25 (నంది పత్రిక ):**ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోరుమామిళ్ల లో చదివే తొమ్మిదవ,పదవ తరగతి విద్యార్థినీ,విద్యార్థుల ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ కోర్సు లో భాగంగా పాఠశాల ఎఫ్.ఏ.సి హెచ్ ఎం ఇబ్రహీం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డి.ఇ.ఇ ఐ.రవి చంద్ర శేఖర్ , ఏ.ఇ.ఇ కె.వెంకట మహేష్ అనుమతి తో పోరుమామిళ్ల పరిధి లోని 33/11 కె.వి సబ్ స్టేషన్ ను 70 మంది విద్యార్థినీ విద్యార్థులు సందర్శించడం జరిగింది.సబ్ స్టేషన్ లోని ట్రాన్స్ఫార్మర్ మరియు ఇతర భాగాల పేర్లు,వాటి పనితీరు, ఉపయోగాల గురించి ఏ.ఇ.ఇ ఎం.చిన్నయ్య చక్కగా వివరించారు.ఈ కార్యక్రమం లో విద్యుత్ కార్యాలయ సిబ్బంది అనుముల రంగస్వామి, సబ్ స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ ఒకేషనల్ శిక్షకుడు శ్రీనివాసులు,ఉపాధ్యాయులు తిరువీధి జయరాములు,సిద్దిక్,సుజాత,చస్మి పాల్గొన్నారు.

# బాలికలు ధైర్యంగా అనుకున్న లక్ష్యాలను సాధించాలి.

## డాక్టర్ వనజ.

## టిడిపి పట్టణ నాయకురాలు.

**నందికొట్కూరు ఫిబ్రవరి 25( నంది పత్రిక)** బాలికలు ఉన్నత చదువులు చదువుకొని పరిజ్ఞానం సంపాదించుకొని, అనుకున్న ఉన్నతమైన లక్ష్యాలను సాధించి శారీరక మానసిక ధైర్యం కలిగి ఉండాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలుగుతారని బాలికలకు పట్టణ టిడిపి మహిళా నాయకురాలు డాక్టర్ వనజ సూచించారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని ఆరవ సచివాలయంలో బాల్యవివాహాల నివారణకు ప్రత్యేక చట్టాలు మరియు బాలికల ఆత్మరక్షణ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి పట్టణ మహిళా నాయకురాలు డాక్టర్ వనజ హాజరయ్యారు. అనంతరం ఆమె బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికల ఉన్నతమైన లక్ష్యాల సాధన కోసం, చట్టంలో అందరితోపాటుగా సమాన హక్కులు కల్పించబడ్డాయని, వాటిని సంపూర్ణంగా తెలుసుకొని తమ జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా న్యాయపరంగా ఎదుర్కొనీ నిలదుక్కోవాలని బాలికల రక్షణ చట్టాల గురించి ఆమె వివరించారు. సమాజంలో బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రోత్సహించే వారిపై చట్టపరంగా శిక్షలు పడతాయని ఆయన హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల అనారోగ్యాల పాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని, అది గమనించాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉందని ఆయన తెలిపారు. చట్ట ప్రకారం నిర్ధారించిన వయస్సు వరకు ఎలాంటి వివాహాలు చేయరాదన్నారు. బాలికలు చదువులో ఉన్నతంగా రాణించి అనుకున్న లక్ష్యాలను సాధించాలి అంటే ముందు శారీరకంగా మానసికంగా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. బాల



బాలికల రక్షణ చట్టాలు మహిళల చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆమె బాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అడ్మిన్, వీఆర్వో, ఎమ్మెస్ కే, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి, ఏఎన్ఎంఎస్ మరియు ఆశ వర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.

# శాలివాహన కురువృద్ధునికి ఘన నివాళులు



**బనగానపల్లె ఫిబ్రవరి 25 నందిపత్రిక** శాలివాహన కురువృద్ధుడు స్వర్గీయ ఐలాపురం వెంకయ్య కు బనగానపల్లె శాలివాహన సంఘ సభ్యులు బుధవారం ఘనంగా నివాళులార్పించారు. ఐలాపురం వెంకయ్య 1930లో జన్మించి ఈనెల 15వ తేదీ 2026 స్వర్గస్తులు అయ్యారు. ఈయన 96 సంవత్సరాలు జీవించిన శాలివాహన కురవృదుడు అయినటువంటి పెద్దలు ఐలాపురం వెంకయ్య అని సంఘస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు సామాజిక సేవకుడు వెంకయ్య కూలీ పనులు చేసుకుంటున్న సాధారణ కుటుంబం నుండి వచ్చి విజయవాడ నగరంలో ఆనాడు వ్యాపార రంగం మొదలుపెట్టి హోటల్ వ్యాపారం తో అంచెఅంచంచలుగా ఎదగడం జరిగింది ఒకవైపు తన శాలివాహన సామాజిక వర్గానికి అండగా ఉంటూనే బీసీ నేతగా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, సంక్షేమం కోసం, జీవితాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తి పెద్దలు ఐలాపురం వెంకయ్య అని నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడం జరిగింది . అదేవిధంగా ఒకసారి ఎమ్మెల్యే టికెట్ రావడంతో పోటీ చేసి స్వల్ప మెజారిటితో ఓడిపోవడం జరిగింది.కుమ్మరులు ఆర్థికంగా నిలదక్కోవాలని దృఢమైన సంకల్పంతో నాడు ప్రభుత్వంతో మాట్లాడి బీసీ కార్పొరేషన్ ద్వారా లోన్స్ ఇచ్చే విదంగా కార్యాచరణ ప్రారంభించడం జరిగింది.అలాంటి మన శాలివాహన సంఘకర్త సామాజికవేత్త ను కోల్పోవడం మనకు తీరని లోటుగా అభివర్నిస్తూ ఆ మహనీయునికి బనగానపల్లె నియోజకవర్గం కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సురేష్ పాతపాడు మహేష్ శివరాం నాగరాజు శివరామకృష్ణ వెంకటసుబ్బయ్య సొంగల శంకర్ శ్రీను నాగేంద్ర నాగమయ్య అన్నవరం సూరి పాతపాడు సాయి రాజి లక్ష్మి బాగ్య రాజశేఖర్ సాయి పాల్గొన్నారు.

# మనంచేసే ప్రతికార్యం కర్మానుసారం జరుగుతుంది అంటారు.

**మంత్రాలయం పిబ్రవరి25 (నందిదినపత్రిక ప్రతినిధి)** ఈరోజుల్లో తప్పు చేసేవారు బాగానే ఉంటున్నారు. సత్కార్యాలు చేసేవారు ఇబ్బంది పడుతున్నారు. ఎందువల్ల ఇలాజరుగు తుంది. తాతా చూస్తూంటే అధర్మపరులే ఎక్కువ సుఖ పడుతూన్నట్లు కనిపిస్తుంది, ఎందుకని అని అంటాడు ధర్మరాజు భీష్ముడితో. ఇది ఇప్పుడు మనవంటి వారికి వచ్చే సందేహమే, ఇప్పటి నాయకులను, జరుగుతున్న విషయాలు చూస్తూన్నప్పుడు. భీష్ముడు అంటారు అది నీభ్రమ. జన్మజన్మల నుంచి పేరుకున్న పుణ్యాన్ని ఇప్పుడు ఇలా అనుభవిస్తున్నారు వారు. ఇప్పుడు చేసే పాపపు పనులకు వారు ఫలితం తొందరలో అనుభవించక తప్పదు అని. ఎంతటి చక్కని సమాధానం. ధర్మ ఏవ మనః కృష్ణే స్వభావ ధర్మంగా ఉండడం నాస్వభావం మరి, ఏమి చేయమంటావంటారు ధర్మరాజు ద్రౌపదితో. ద్రౌపది ఎప్పుడూ ధర్మం ధర్మం అనే మీరు అడవులు పట్టుకు తిరుగుతున్నారు.అధర్మం చేస్తూన్న వారు రాజ్యాలేలు తున్నారు అంటే ఏమి చేయ మంటావు, నాస్వభావం అటువంటిది అంటారు ధర్మరాజు. పుట్టుకతో వచ్చిన బుద్ధులు స్వభావంపుడకలతో కాని పోవు అని సామెత. మనిషి స్వభావం అంత తేలిగ్గామారదు.మామూలుగా వాడుతున్నారు కాని స్వభావం అనేది మంచి లక్షణం. ప్రభావం అంటే అలవాటు చేసుకునేది. అభావం అనేది చెడులక్షణం. ఈ అభావాన్ని సాధనతో, మంచి సత్సాంగత్యంతో ప్రభావంగా మార్చుకోవడానికి అవకాశముంది. పుణ్యఫలం, పాపఫలం రెండూ నశిస్తేనే ముక్తి. రెండూ విడివిడిగా అనుభవించాలి.

పాపం లోంచి పుణ్యం, పుణ్యంలోంచి పాపం తీసేయడం కుదరదు, జరుగదు. అందుకే పరమ దుర్మార్గుడు కూడా కొన్ని సుఖాలు పొందుతూ ఉంటాడు అప్పుడప్పుడు. మిగిలిన తన పూర్వజన్మ పుణ్యఫలం వల్ల.మంచి పనులు చేసేవారికి చెడు రోజులు ఉండవు అన్నారు పరమాత్మ గీతలో.ఆరకంగా ముందుకు సాగుదాం.

# నాటు సారా కలిగి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్.. స్కూటీ స్వాధీనం.

## రామాంజనేయులు. ఎక్సైజ్ సీఐ.



**నందికొట్కూరు ఫిబ్రవరి 25( నంది పత్రిక)** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్ రవికుమార్ సూచనలతో మెత్తూరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం దగ్గర టీవీఎస్ జూపిటర్ నందు నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నించగా స్కూటీ (ఏపీ 39 క్యు టి 87 95 నంబర్ )నీ వదిలి వెళ్లి పారిపోవడంతో స్కూటీని మరియు 5 లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అదేవిధంగా పగిడాల మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో షికారి కాలియా అనే వ్యక్తి వద్ద ఐదు లీటర్ల నాటు సారా సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ దాడుల్లో నందికొట్కూరు ఎక్సైజ్ ఎస్సైలు భాష్యం శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్స్ శంకర్ నాయక్, కుమారి, కానిస్టేబుల్స్ శివన్న, సుధీర్, మధు ప్రసాద్ పాల్గొన్నారు.

# కర్ణాటక రాష్ట్రములో భక్త బృందాలతో సమన్వయ సమావేశం





**శ్రీశైలం ఫిబ్రవరి 25(నంది పత్రిక)** శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు 16.03.2026 నుండి 20.03.2026 వరకు జరుగనున్నాయి. ఉగాది పర్వదినం 19.03.2026 రానున్నది. ఈ ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుండి ముఖ్యంగా ఉత్తర కర్ణాటక ప్రాంతం నుండి మహారాష్ట్రలోని షోలాపూర్, సాంగ్లీ తదితర ప్రాంతాల భక్తులు తరలివస్తారు. వీరిలో పలు ప్రాంతాల భక్తులు పాదయాత్రతో శ్రీశైలం రావడం విశేషం. ఈ సందర్భంగా (25.02.2026) కర్ణాటక రాష్ట్రములోని భాగల్‌కోట్ జిల్లా తాలుకా కేంద్రమైన తేర్‌దాళ్‌లోని అల్లమప్రభు దేవస్థానములో భక్త బృందాలు మరియు స్వచ్ఛందసేవా సంస్థలతో సమన్వయ సమావేశం జరిగింది. ముందుగా ఉదయం గం.9.30 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్ల ధర్మప్రచార రథయాత్ర బసవేశ్వర సర్కిల్ నుంచి అల్లమప్రభు దేవాలయం వరకు నిర్వహించబడింది. ఈ రథయాత్రలో అశేషభక్త జనులు దారి అంతా పూలు చల్లుతూ శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల నామాలను ఉచ్ఛరిస్తూ రథానికి స్వాగతం పలికారు. ఆ తరువాత తేర్‌దాళ్ పట్టణంలో శ్రీ అల్లమ ప్రభు దేవాలయంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం గం.12.00లకు సమావేశం ప్రారంభమైనంది. ఈ సమావేశంలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామివారు కూడా ఈ సమావేశంలో పాల్గొని అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠాధిపతి వారు ప్రసంగిస్తూ దేవస్థానం వారు భక్తుల సౌకర్యార్థమై ఆయా దర్శన ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. ఉగాది ఉత్సవాలలో ప్రతీరోజు వేలాది మంది భక్తులు ఆలయానికి రావడం జరుగుతోందన్నారు. భక్తులు అధికసంఖ్యలో ఉంటున్న కారణంగా ఉత్సవాల రోజులలో శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం ఉండదన్నారు. ఈ కారణంగా ఉత్సవరోజులలో దేవస్థానంవారు శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించడం జరుగుతోందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం ఈ విధానాన్ని అనుసరించడం జరుగుతోందన్నారు. అయినప్పటికీ ఉత్సవాలకు ముందు 10 రోజులపాటు అనగా 06.03.2026 నుంచి 15.03.2026 వరకు రోజుకు నాలుగు విడతలుగా దేవస్థానం వారు నిర్దిష్ట వేళలో స్పర్శదర్శానానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. భక్తులు దేవస్థానం నిర్దేశించిన రోజులలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని చేసుకోవచ్చునని అన్నారు. ఇంకా పీఠాధిపతివారు మాట్లాడుతూ భక్తులందరు కూడా సంయమనం పాటిస్తూ శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలన్నారు. అదేవిధంగా దేవస్థానం కల్పించిన ఆయా సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా భక్తులందరు కూడా దేవస్థానానికి సహకరించాలన్నారు. పాదయాత్ర చేసే భక్తులు ఆరోగ్యంపట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మరియు ఉత్సవాలు విజయవంతం చేసేందుకు భక్తులందరూ కూడా సహకరించాలన్నారు.అలాగే అటవీశాఖ విడుదల చేసిన పాదయాత్రికులు చేయవలసినవి చేయకూడనవి నియమాలను కూడా భక్తులకు వివరించి చెప్పారు. అలాగే శ్రీశైలక్షేత్రాన్ని స్వచ్ఛ శ్రీశైలక్షేత్రంగా ఉంచాలని అన్నారు. అంతకు ముందు శ్రీశైలదేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు ప్రసంగిస్తూ శ్రీశైలక్షేత్ర సంస్కృతీ సంప్రదాయాలలో కన్నడ ప్రాంతానికి ఎంతో విశిష్టస్థానం ఉందని తెలుపుతూ, కన్నడ భక్తులు శ్రీభ్రమరాంబాదేవివారిని తమ ఆడపడుచుగా, శ్రీమల్లికార్జునస్వామివార్లను తమ అల్లునిగా భావిస్తారన్నారు. ఇటీవల కాలంలో 11 రోజులపాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరిపించబడ్డాయని, ఇదే పంథాలో ఉగాది మహోత్సవాలను కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఎప్పటి వలే కాలిబాట మార్గములో భక్తులకు దేవస్థానం మంచినీటి సరఫరా మొదలైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు ముఖ్యంగా కాలిబాటలో వచ్చే భక్తులకు అవసరమైన మంచినీరు,మార్గమధ్యంలో దాతల సహకారంతో అన్నదాన ఏర్పాట్లను చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం క్షేత్రపరిధిలోని ఆరుబయలు ప్రదేశాలలో విశాలమైన జర్మన్ షెడ్లను, చలువ పందిర్లను వేయడం జరుగుతుందని, భక్తులందరు ఈ చలువపందిర్లలో సేద తీరవచ్చున్నారు.

అదేవిధంగా క్షేత్రంలో పలుచోట్ల స్నానపు గదులను, మూత్రశాలలను, మరుగుదొడ్లను భక్తులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. భక్తులు వీటిని వినియోగించు కోవచ్చునని పేర్కొన్నారు. ఇక పాతాళగంగలోనూ, క్షేత్రపరిధిలో పలుచోట్ల షవరుబాతులకు ( జల్లు స్నానాలకు) ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఉగాది మహోత్సవాలలో పలు భక్తబృందాల వారు క్షేత్రపరిధిలో అన్నదానాలు చేయడం జరుగుతోందన్నారు. అన్నదానం చేసే భక్త బృందాల వారికి దేవస్థానం తరుపున సంపూర్ణ సహాయ సహకారాలను అందించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, పర్యవేక్షకులు ఆర్. మల్లికార్జున, సహాయ సంపాదకులు కె. సత్య బ్రహ్మాచార్య, పలువురు అర్చకస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో కర్ణాటకలోని పలు ప్రాంతాలకు చెందిన పాదయాత్ర భక్త బృందాల ప్రతినిధులు, స్వచ్ఛందసేవా సంస్థ ప్రతినిధులు మొత్తం 20 బృందాలు పాల్గొన్నారు.





# అష్ట లక్ష్మి కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవముకు మాజీ ఎమ్మెల్యే



**కోయిలకుంట్ల ఫిబ్రవరి 25 నందిపత్రిక** కోయిలకుంట్ల పట్టణంలోని శ్రీ అష్టలక్ష్మి కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి మూడవ వార్షికోత్సవంను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు.బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా ఆలయ కమిటీ నిర్వహకులు శాలువా కప్పి పూలమాలతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్సిపి నాయకులు భీమిరెడ్డి ప్రతాపరెడ్డి , వెలగటూరు సర్పంచ్ లక్కిరెడ్డి వెంకట సుధాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దండు మధు, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, ఎల్ఐసి రామ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మా వీధిలో లైట్ వేయించండి మహాప్రభో



**కర్నూలు నంది పత్రిక.....** మా వీధిలో లైట్లు వేయించండి అని వేడుకుంటున్న సంబంధిత కమిటీ మెంబర్లు పట్టించుకోవడంలేదని మేము గత 7 సంవత్సరాల నుండి మేము ఆ స్రీయ వెంచర్ నందు నివాసముంటున్నాము . గత రెండు సంవత్సరముల నుండి మాకు ఈ వెంచర్ లోఎటువంటి మౌలిక సదుపాయాలు లేవు వీధిలైట్లు లేవు , నీటి సమస్య తీవ్రంగా ఉంది అని వెంచర్లోని కమిటీ వాళ్లు ఎన్నిసార్లు అడిగినా మీరు డబ్బులు ఇస్తేనే వీధిలైట్లు చేపిస్తాము లేకపోతే వేయించమని కండిషన్ గా మాట్లాడుతున్నారని వెంచర్ లోని బాధితులు కళ్యాణ్ ఆవేదన తెలియజేశారు. ఈ వెంచర్ను వేరే వారికి అప్పగించాము వారే చూసుకుంటారు మాకు సంబంధం లేదు అని డిమాండ్ గా మాట్లాడుతున్నారు అని బాధితుడు తెలియజేశారు.వెంచర్ లోని సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాము.

# సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఫిబ్రవరి 25:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న గాలి చెన్నయ్య పాలెం గ్రామానికి సిమెంటు రోడ్లు మంజూరు అయ్యాయి. ఎన్ ఆర్ జి ఎస్ పథకం కింద శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 35 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. గాలి చెన్నయ్యపాలెం గ్రామం నుండి నెమళ్లకుంట ఉండే రస్తాలో 400 మీటర్ల పొడవు వరకు ఈ సిమెంటు రోడ్డు నిర్మాణం పనులను చేపడుతూ ఉన్నారు. పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్రాముడు ఈ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కంచర్ల లింగారెడ్డి కూడా పాలుపంచుకుంటున్నారు.

# వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ





**హాస్టల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**
**చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలి**
**భద్రతా చర్యలు కచ్చితంగా పాటించాలి**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**వాసవి పెనుగొండ: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25, నంది పత్రిక.** పెనుగొండలోని వాసవి వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థినులకు అందుతున్న వసతులు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లపై ఆమె నిశితంగా సమీక్ష నిర్వహించారు. తనిఖీ సందర్భంగా హాస్టల్ పరిసరాలు, విద్యార్థినులు నివసిస్తున్న గదులు, భోజనశాల, వంటగది, నిల్వ గదులు, త్రాగునీటి సదుపాయాలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్‌లో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థినులు నివసిస్తూ చదువుకుంటున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు నమోదు పుస్తకాలు, హాస్టల్ రిజిస్టర్లను పరిశీలించి అందుబాటులో ఉన్న సదుపాయాలు విద్యార్థినుల అవసరాలకు సరిపోతున్నాయా అని ఆరా తీశారు. ముఖ్యంగా బాత్‌రూములు, మరుగుదొడ్లు విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని నిర్వాహకులను ప్రశ్నించారు. అవసరమైతే అదనపు సౌకర్యాలు వెంటనే కల్పించాలని ఆదేశించారు. హాస్టల్‌లో అన్ని మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భోజనం నాణ్యత, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయం, పడకగదుల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థినులు ప్రశాంతంగా చదువుకునేలా అనుకూలమైన వాతావరణం కల్పించడం నిర్వాహకుల బాధ్యత అని స్పష్టం చేశారు. హాస్టల్ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాలికల భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభ్యాస విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వసతి గృహం అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జి.అనిత కుమారి, వసతి గృహ సంక్షేమ అధికారి వై.పద్మజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూల్క్ లెవెల్ స్పెల్ బి ప్రోగ్రాం లో సత్తా చాటిన స్కాలర్ స్కూల్ విద్యార్థులు.

## విద్యార్థులను అభినందించిన కళాశాల కరస్పాండెంట్, కాలూరి లక్ష్మి,కాలూరి శివప్రసాద్.

**నందికొట్కూరు ఫిబ్రవరి25( నంది పత్రిక )** రైన్ బో ఎద్యుకేటెడ్ ఈ ఈ ఎల్ ఎల్ ఇంగ్లీష్ లెర్నింగ్ వారు నిర్వహించిన స్కూల్ లెవెల్ స్పెల్ బి ప్రోగ్రాం నందు తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు మంచి ప్రతిభతో మొదటి స్థాయి బహుమతులను గెలుపొందడం జరిగిందనీ స్కాలర్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మరియు డైరెక్టర్స్ కాలూరి లక్ష్మి, కాలూరి శివప్రసాద్ లు తెలిపారు. స్కూల్ లెవెల్ స్పెల్బీ ప్రోగ్రాం నందు సత్తా చాటి బహుమతులను పొందిన ఫస్ట్ క్లాస్ ప్రథమ బహుమతి అశ్విని సాయి, సెకండ్ క్లాస్ మొదటి బహుమతి అయేషా, థర్డ్ క్లాస్ మొదటి బహుమతి బి ఆయేషా, ఫోర్త్ క్లాస్ ప్రథమ బహుమతి నూజహత లను బుధవారం తమ పాఠశాల నందు పాఠశాల యాజమాన్యం కాలూరి లక్ష్మి, శివప్రసాద్ విద్యార్థి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసిన వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల బృందం

**భీమవరం: చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని భారతీయ వరి పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్తల బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సంస్థకు చెందిన డా. వి. మానస, డా. జాగృతి రోహిత్, డా. కె.వి. రాఘవేంద్ర, డా. సతీష్ చవాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో భారతీయ వరి పరిశోధన సంస్థ మరియు రైతు సాధికార సంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు పురోగతిని శాస్త్రవేత్తలు కలెక్టర్‌కు వివరించారు. ప్రకృతి ఆధారిత పద్ధతుల ద్వారా వరి ఉత్పాదకత పెంపు, ఖర్చు తగ్గింపు, రైతుల ఆదాయం మెరుగుదల వంటి అంశాలపై వారు సమగ్ర వివరణ ఇచ్చారు.



అలాగే జిల్లాలో ఈ ప్రాజెక్టును మరింత విస్తరించే అవకాశాలపై చర్చ జరిగింది. సమావేశం అనంతరం శాస్త్రవేత్తలు అధిక జింక్ కలిగిన, తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న డి.ఆర్.ఆర్. ధాన్48 వరి వంగడాన్ని జిల్లా కలెక్టర్‌కు బహుకరించారు. ఈ వరి రకంలో జింక్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ప్రజల్లో పోషకాహార లోప సమస్యను తగ్గించడంలో దోహదపడుతుందని వారు తెలిపారు. అలాగే తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉండటం వలన మధుమేహ రోగులకు కూడా ఈ బియ్యం ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. జిల్లాలో పోషక విలువలతో కూడిన వరి రకాల ప్రోత్సాహం, ప్రకృతి వ్యవసాయం విస్తరణ దిశగా సంస్థ చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో రైతులకు మరింత అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశం ద్వారా జిల్లాలో పోషక భద్రత, రైతు సంక్షేమం, సుస్థిర వ్యవసాయ విధానాల అమలుకు పరస్పర సహకారం మరింత బలపడినట్లు అయ్యింది.

# వేర్వేరు ప్రాంతాల్లో ప్రేమ జంట ఆత్మహత్య

వనపర్తి జిల్లాకు చెందిన ప్రేమ జంట వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కేత్రావత్ వసంత అనే యువతి బాసర ఐఐటీ హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

వనపర్తి మండలం అప్పయ్య పల్లి శివారులోని కిర్యా తండా చెందిన గణెళిష్ కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఈ ఇద్దరు చనిపోవడానికి ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. వసంత, గణెళిశ్.. ఇద్దరూ బంధువులు అని తెలిసింది. వసంత ఇంజినీరింగ్ సెకండియర్ చదువుతుంది. వసంత హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి పోలీసులు స్పాట్ కు వెళ్లారు. వసంత మృతదేహాన్ని భైంసా అసుపత్రికి తరలించారు. వసంత తల్లిదండ్రులకు కాల్ చేసి విషయం చెప్పారు. భైంసా ఆసుపత్రి ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్?లో రూమ్?మేట్స్?ను, ఐఐటీ క్యాంపస్?లో వసంత ఫ్రెండ్స్ ను పోలీసులు ఆమె గురించి ఆరా తీశారు. వసంత ప్రేమలో ఉందనే విషయం మాత్రం పోలీసులు విచారణలో స్పష్టమైంది. గణెళిష్, వసంత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

# పశ్చిమగోదావరి జిల్లాలో సీఎంఆర్ పారదర్శకత నిర్ధారణకు రైస్ మిల్లులు ఆకస్మిక తనిఖీలు

**జిల్లాలోని 30 రైస్ మిల్లులను ఎంపిక చేసి వివిధ శాఖలకు చెందిన 30 మంది అధికారులతో ఒకేసారి ఆకస్మిక తనిఖీలు**

**జిల్లాలోని రైస్ మిల్లుల కార్యకలాపాలపై కఠిన పర్యవేక్షణ చేపట్టిన అధికారులు**

**వివిధ శాఖల జిల్లా అధికారులు, పౌర సరఫరాలు, రెవెన్యూ, ఎఫ్‌సీఐ, తదితర శాఖల అధికారులు సంయుక్తంగా మిల్లుల రికార్డులు, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియలను పరిశీలన.**

**ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్‌లో ఎలాంటి అక్రమాలు జరిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 25, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కార్యకలాపాలలో పారదర్శకత నిర్ధారణకు, సకాలంలో రైస్ డెలివరీలను చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తొలుత ఈ విషయమై ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయము జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలో ఎంపిక చేసిన 30 రైస్ మిల్లులు ఆకస్మిక తనిఖీలకు నియమించిన జిల్లా అధికారులతో బుధవారం గూగుల్ మీట్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. తనిఖీలు అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో కష్టం మిల్లింగ్ నందు పాల్గొనుచున్న 30 రైస్ మిల్లులను యాదృచ్ఛికంగా ఎంపిక చేసి వాటిని ఆకస్మికంగా తనిఖీ చేయవలసినదిగా వివిధ శాఖలకు చెందిన 30 మంది జిల్లా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కొనుగోలు కార్యక్రమాల్లో పారదర్శకతను నిర్ధారించడం, సమయానికి రైస్ డెలివరీలు జరిగేలా చేయడం ఈ తనిఖీల లక్ష్యం అన్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లాలోని 30 రైస్ మిల్లులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు ఆన్లైన్ ధాన్యం పోర్టల్ మరియు ఆన్లైన్ రికార్డులు, ఆా & దీ రిజిస్టర్లు, భౌతిక గ్రౌండ్ బ్యాలెన్స్ ధాన్యమును తనకి చేయడం జరిగిందని, రైతు సేవా కేంద్రాల నుండి మిల్లింగ్ కొరకు రైస్ మిల్లర్లు స్వీకరించిన మొత్తం ధాన్యం, ఎఫ్.సి.ఐ.కు చేసిన మొత్తం సి.ఎం.ఆర్. డెలివరీలు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ కు చేసిన మొత్తం సి.ఎం.ఆర్. డెలివరీలు, మిల్లులో మిగిలి ఉండాల్సిన బ్యాలెన్స్ ధాన్యం (మీలలో & బ్యాగులలో) ను పరిశీలించి, ఆా రిజిస్టర్ మరియు గ్రౌండ్ బ్యాలెన్స్ తో పునఃపరిశీలన చేసి వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. రైస్ మిల్లర్లకు డెలివరీలను వేగవంతం చేయాలని, ఖరీఫ్ 2025-26 సీజన్ కు సంబంధించి నిర్దేశిత సమయంలోపు మార్చి 31 నాటికి ఎలాంటి డెలివరీలు అలస్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. సకాలంలో డెలివరీ చేయని రైస్ మిల్లర్ పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది జిల్లా కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ సంబంధించి జిల్లాలో సుమారు 4.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 207 రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. మొదట సీఎంఆర్ మిల్లింగ్ పూర్తిచేసి, అనంతరం మాత్రమే ఇతర మిల్లింగ్ కార్యకలాపాలు చేపట్టాలని మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎంఆర్‌లో ఎలాంటి హెచ్చుతగ్గులు, ఆలస్యం లేదా వ్యత్యాసాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని



హెచ్చరించారు. ఎఫ్‌సీఐ మరియు సివిల్ సప్లైస్ శాఖలకు మిల్లర్లు నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యం సరఫరా చేయాలని సూచించారు. సీఎంఆర్‌కు సంబంధించిన "ఎ" రిజిస్టర్‌ను తప్పనిసరిగా అప్డేట్‌గా నిర్వహించాలని, అందులో నమోదైన స్టాక్ మరియు భౌతిక నిల్వల మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ప్రైవేటు మిల్లింగ్‌కు సంబంధించిన లావాదేవీలను తప్పనిసరిగా "బి" రిజిస్టర్‌లో మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ధాన్యం మరియు ప్రైవేటు ధాన్యం మధ్య స్పష్టమైన ఏర్పాట్లు ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ బియ్యంను ప్రజలకు సరైన సమయంలో, సరైన నాణ్యతతో బియ్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖిలలో రెవిన్యూ, పశుసంవర్ధకం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఎస్ జి ఎస్ డబ్ల్యూ, బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార, విద్య, దేవాదాయ, విద్యుత్, ఎక్సైజ్, అగ్నిమాపక, మత్స్య, భూగర్భ జలాలు, చేనేత, గృహనిర్మాణం, పరిశ్రమలు, కార్మిక, గనులు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, సోషల్ వెల్ఫేర్, సర్వే, రవాణా, పర్యాటక శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే ఫిబ్రవరి 28న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

**జిల్లాలో 2,22,982 మంది లబ్ధిదారులకు ప్రయోజనం**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25 నంది పత్రిక** ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి ఒకటికి బదులుగా ఒక్కరోజు ముందుగానే ఫిబ్రవరి 28న పింఛన్లను అందజేయడం జరుగుతుందన్నారు. మార్చి 1 ఆదివారం వచ్చినందున పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పింఛన్లు అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించిన డబ్బులు బ్యాంకు నుండి విత్ డ్రా, తదితర పనులను ఫిబ్రవరి 27 నాటికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,22,982 మంది పింఛనుదారులకు రూ.96.39 కోట్లు నగదును సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. పింఛన్లు పంపిణీ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, గౌరవంగా పింఛన్లను అందించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఏమైనా సమస్య ఉంటే వెంటనే జిల్లా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ దృష్టి తీసుకురావాలని తెలిపారు.

## ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేసి 3 రోజుల్లో నూరు శాతం సాధించాలి

**ఈ కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలి.**

**జిల్లాలో పి4 ద్వారా బంగారు కుటుంబాలకు మెరుగైన ప్రయోజనాలు సమకూరాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం (వాసవి పెనుగొండ/ పోడూరు/ యలమంచిలి) చీఫ్ బ్యూరో: ఫిబ్రవరి 25, నంది పత్రిక** పశ్చిమగోదావరి జిల్లాలో ఏకీకృత కుటుంబ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. వాసవి పెనుగొండ, పోడూరు, యలమంచిలి తహసిల్దార్ కార్యాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ చదవడం నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండలాలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియలు ఏకీకృత కుటుంబ సర్వే, ఈ-కేవైసీ, పి 4 పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలాలో ఇప్పటివరకు యు ఎఫ్ ఎస్ సర్వే సుమారు 70 శాతం సర్వే పూర్తయిందని అధికారులు తెలియజేయగా, మిగిలిన 30 శాతం పనిని వచ్చే మూడు రోజుల్లో పూర్తి చేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని ఎంపీడీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సర్వే ప్రక్రియలో వేగం తీసుకురావడానికి సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 7.00 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి చేరుకుని వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యంగా పూర్తి చేసి లక్ష్య సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో తహసిల్దార్లు సయ్యద్ మౌలానా ఫాజిల్, జి.అనిత కుమారి, గ్రంధి పవన్ కుమార్, ఎంపీడీవో లు మంగా కుమారి, సూర్యనారాయణ మూర్తి, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

# దళిత మాదిగలకు రక్షణ కల్పించాలి. ఎమ్మార్పీఎస్ సంఘాల నాయకులు డిమాండ్



**హత్యకు గురైన టీఎం రమేష్ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

**బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలి**

**ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా కల్పించాలి**

**కర్నూలు నంది పత్రిక.....** కర్నూలు నగరంలో బుధవారం అంబేద్కర్ భవన్ లో ఎమ్మార్పీఎస్ సంఘాల ఐక్యత మహాసభ ఏర్పాటు చేయడం జరిగినది ఈ సభలోని ముఖ్య ఉద్దేశం ఇటీవల కాలంలో ఎంఆర్పిఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదిగ హత్యకు గురి కావడంతో స్థానిక అంబేద్కర్ భవన్లో నిరసన సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ సంఘాల ముఖ్య నాయకులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం ఈద్ ముడి గ్రామంలో 20 మంది యువకులతో మొదలైన మాదిగ దండోరా ఉద్యమం ఈరోజుకు అంచలంచలుగా ఎదిగి కొన్ని జిల్లాలే కాక రాష్ట్రాలకు కూడా చేరిందన్నారు అయితే కొంతమంది ఎమ్మార్పీఎస్ కు తల్లి లాంటి గ్రామమైన ఈద్ ముడి గ్రామాన్ని మరచి వారు ఏదో స్వతంత్రంగా ఉద్యమాన్ని తీసుకొచ్చినట్టు చలామణి అవుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మేమే పెద్దదిక్కు అని చెబుతూ ఎమ్మార్పీఎస్ ని వారి స్వలాభం కోసం వినియోగించుకొని మాదిగలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలతో చేతులు కలిపి ఎమ్మార్పీఎస్ ను అడ్డంగా పెట్టుకుని లబ్ధి పొందుతున్నారని దుయ్యబట్టారు. అదేవిధంగా అగ్రవర్ణాల చేతిలో బలి అయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అలాగే ఐదు ఎకరాల భూమిని ఇచ్చి ఐదు సెంట్ల ఇంటి స్థలం ఏర్పాటు చేసి ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మాదిగల పై దాడులు అరికట్టాలి అంటే ప్రభుత్వం వెంటనే నిందితులకు శిక్ష పడే విధంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి లేనిపక్షంలో మాదిగలకు న్యాయం జరిగే వరకూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేర పోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో మాదిగలపై జరుగుతున్న హత్యలను అత్యాచారాలు ఎక్కువ అయ్యాయా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అగ్రవర్ణాలు మాదిగలపై హత్యలు చేస్తూ అత్యాచారాలు చేస్తూ పెట్రేగిపోతున్నప్పటికీ మాదిగలపై దాడులను అరికట్టడంలోను మాదిగలకు రక్షణ కల్పించడం లోను ప్రభుత్వం విఫలమైందంటూ వీరుచుకుపడ్డాడు. అలాగే ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టిఎం రమేష్ మాదిగ హత్యకు గురై ఇప్పటికీ దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ పీఎం రమేష్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించక పోగా కనీసం ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం కూడా అందకపోవడం చాలా బాధాకరం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పీఎం రమేష్ కుటుంబానికి రక్షణ కల్పిస్తూ ఆ కుటుంబంలోని పెద్ద హత్యకు గురి అయినందున ఆ కుటుంబ జీవనోపాధి భారంగా మారకముందే ఆ కుటుంబములో ఒకరికి ప్రభుత్వం తక్షణమే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు మాదిగ మాట్లాడుతూ తరాలు వేరైనా అంతరంగాలు ఒక్కటే అన్న నినాదంతో ఎమ్మార్పీఎస్ అన్ని సంఘాలను కలుపుకొని ఎవరైతే మాదిగలు అగ్రవర్ణాల చేతిలో హత్యలకు గురై అత్యాచారాలకు గురైన కుటుంబాలకు అండగా ఉంటూ ఇకపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం అంటూ ఘాటుగా హెచ్చరించారు జగ్గుల ప్రకాష్ మాదిగ హత్యను మొదలుకొని ఇప్పటివరకు హత్యకు అత్యాచారాలకు గురైన మాదిగ సోదర సోదరీమణుల పేర్లు చెబుతూ ఆ కుటుంబాలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ ఆ కుటుంబాలలో ఇంటికి ఒకరికి ఉద్యోగం కల్పిస్తూ 5 ఎకరాల భూమిని ఇస్తూ ఇంటి నిర్మాణం కొరకు ఐదు సెంట్ల భూమిని ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రభుత్వంపై యుద్ధము చేయడానికి కూడా వెనకాడ అంటూ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు ఘాటుగా హెచ్చరించారు. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సోమ సుందరం మాదిగ మాట్లాడుతూ మాదిగలు రోజుకు ఒకరు హత్యకు గురైతున్నప్పటికీ ప్రభుత్వం సిగ్గుచేటు వ్యాఖ్యానించారు ఇప్పటివరకు మాదిగలు అన్ని విధాలుగా నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వానికి చెల్లడం లేక పోవడం గమనార్హం ఇటీవల కాలంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు రాజకీయ నాయకుల అండదండలతో మరియు ప్రభుత్వ అధికారుల అండదండలతో మాదిగల స్మశాన వాటికను కూడా కబ్జా చేసినప్పటికీ అధికారులు నోరు మెదకపోవడం సిగ్గుచేటుంటూ ఏ దేవ చేశారు. ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు అడ్డాకుల నాగేశ్వరి మాట్లాడుతూ మాదిగలపై ఇన్ని దాడులు జరుగుతున్నప్పటికీ మనము చేతులు ముడుచుకొని కూర్చుంటే అగ్రవర్ణాలవారు చులకన భావంతో చూస్తారు కాబట్టి మాదిగ సోదరులారా ఏకంకండి మన మాదిగలపై దాడులు చేస్తూ హత్యలు చేస్తూ అగ్ర కులాల వారు మన మాదిగ బిడ్డలను రోజుకు ఒకరిని బలి తీసుకుంటున్నప్పటికీ మనము చేతులు ముడుచుకొని కూర్చుంటే దారిన పోయే ప్రతి అడ్డమైన గాడిదకు అలుసైపోతాము కావున మాదిగలంతా ఏకమై ఏది రెడ్డి నిలబడితే తప్ప మనకు న్యాయం జరగదు అంటూ మాదిగలర ఏకంకండి అంటూ పిలుపునిచ్చారు అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రెడ్డి పోగు కళావతి మాట్లాడుతూ ఇటీవల కాలంలో హత్యకు గురైన ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ రాష్ట్రంలో ఉన్న మాదిగ మహిళలంతా ఏకమై ఉద్యమిస్తామంటూ ఘాటుగా హెచ్చరించారు కూటమి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మాదిగలకు రక్షణ కల్పిస్తూ మాదిగలపై దాడి చేసిన వారికి తక్షణమే శిక్ష పడే విధంగా ఫాస్ట్ ట్రాకోర్టు ఏర్పాటు చేసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి ఒక్కటి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హత్యకు గురైన ఎమ్మార్పీఎస్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పేర పోగు వెంకటేశ్వరరావు మాదిగ, ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సోమ సుందరం మాదిగ,ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు జయకుమార్ (విల్సెంట్) మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీరామ్ మాదిగ, కర్నూలు జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ముప్పసాని సుధాకర్ మాదిగ, రాయలసీమ దండోరా నాయకులు అనంతరత్నం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్ద రాజశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరశురాం మాదిగ, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు కన్నే మరకల వెంకటేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు గిడ్డయ్య మాదిగ, పత్తికొండ ఎమ్మార్పీఎస్ నాయకులు రంగయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు అడ్డాకుల నాగేశ్వరి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకురాలు రెడ్డి పోగు కళావతి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకురాలు శాంతి మాదిగ, నవీన్ మాదిగ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గోర్లగుట్ట పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు.



**బేతంచెర్ల ఫిబ్రవరి 25 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గోర్ల గుట్ట గ్రామంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని బుధవారం గ్రామ ప్రజలు శ్రీ శ్రీ పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారికి అర్చకులు పద్మనాభయ్య ఆధ్వర్యంలో సామూహిక అభిషేకములు, కుంకు మార్చన, మహా మంగళ హారతి మొదలగు కార్యక్రమములు నిర్వహించడం జరిగింది. గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పెద్దమ్మ అమ్మవారికి పూజలు చేశారు.అనంతరం పద్మనాభయ్య గ్రామ ప్రజలకు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, నాగరాజు, ఆదిత్య, విక్రమ్,సుభద్రా దేవి, వరలక్ష్మీ, మీనాక్షి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదువుతూ మంచి మార్కులు సాధించాలి



**మహానంది ఫిబ్రవరి 25 (నంది పత్రిక):-** విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా చదువుతూ మంచి మార్కులు సాధించాలని నంద్యాల జిల్లా డిప్యూటీ డీఈఓ శంకర వర ప్రసాద్ కోరారు. మహానంది మండల కేంద్రం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు.పదో తరగతి విద్యార్థుల గ్రేడింగ్లను పరిశీలించారు.ప్రతి విద్యార్థి కూడా పరీక్షలు దగ్గరగా వస్తున్నాయి కాబట్టి ఎటువంటి టెన్షన్ లేకుండా ఒక క్రమమైన పద్ధతిలో చదువుకొని పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని అన్నారు.ఉపాధ్యాయ బృందానికి పదో తరగతి లోని డీ గ్రేడ్ పిల్లవాళ్ళందరూ కూడా ఉత్తీర్ణులు అగు విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఏజెన్సీ వారికి సూచించారు.ప్రతి ఉపాధ్యాయుల కూడా సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు.మినరల్ వాటర్ పరిశీలించి నీటిని పరిశుభ్రంగా ప్రతి ఒక్క విద్యార్థికి అందించాలన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయుడు హనుమంతు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**నంద్యాల ప్రతినిధి ఫిబ్రవరి 25 నంది పత్రిక** జిల్లా లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖలో భాగమైన వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య స్కూల్ నందు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మరియు డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ విద్యార్థులకు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా , సైబర్ క్రైమ్ గురించి వివరించడం జరిగింది. మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక వేధింపులు,సామాజిక మాధ్యమాల ద్వార ఎదురయ్యే సమస్యల గురించి మరియు టోల్ ఫ్రీ నెంబర్స్ 181,1098,100 గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.



## డీలర్లు సమయ వేళలు ఖచ్చితంగా పాటించాలి.

### తహసీల్దార్ కె. రమాదేవి



**మంత్రాలయం ఫిబ్రవరి 25,** డీలర్ ఖచ్చితంగా సమయ పాలన పాటించాలని తహసీల్దార్ కె రమాదేవి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న డీలర్ షాపులను ఖచ్చితంగా ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలని తెలిపారు. ప్రతి నెల 25 వ తేదీ నుండి 60 ఏళ్ల పై బడిన వృద్ధులైన లబ్ధిదారులకు ఇంటి దగ్గరకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ పంపిణీ లో తూనికల పై లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా డీలర్ షిప్ లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర ఆర్ఐ జనార్దన్ రావు సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి విఆర్ఓ భీమయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళన బిఎల్వోలు బాధ్యతగా చేయాలి

### తహసీల్దార్ కె రమాదేవి

**మంత్రాలయం ఫిబ్రవరి 25,** ఓటరు జాబితా ప్రక్షాళనను బిఎల్వోలు బాధ్యతగా చేయాలని తహసీల్దార్ కె రమాదేవి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బిఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా లో ఒక ఓటరు పేరు రెండు చోట్ల ఉన్నట్లైతే విచారణ జరిపి వెంటనే ఒకటి తొలగించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ను సరిచేసేందుకు ఫారం నెంబర్ 6,7,8 లను ఉపయోగించే విధంగా అవగాహన కల్పించి ఓటరు జాబితా ను తయారు చేయాలని కోరారు. ఆన్లైన్ లో ఓటరు నమోదు కు ఆన్లైన్ ద్వారా వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి ఎపటి కప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి అనుమానాలు సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజ రావు ఆర్ఐ జనార్దన్ రావు కంప్యూటర్ ఆపరేటర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ కార్యదర్శి పియూష్ కుమార్ పి -4 ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న :జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25 నంది పత్రిక** అమరావతి సచివాలయం నుండి బుధవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి పియుష్ కుమార్ పి4 ప్రగతిపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, సిపిఓ కె.శివ పార్వతి, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రిన్సిపల్ కార్యదర్శికి జిల్లాలో అమలు చేస్తున్న పి4 కార్యక్రమాల పురోగతిని వివరించారు. పి4 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వైద్య శిబిరాల ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం, పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే పేదలకు ప్రతి నెలా రేషన్ సరఫరా సక్రమంగా కొనసాగుతున్నదని తెలిపారు. జిల్లాలో మార్గదర్శకుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని పేర్కొన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో పట్టు, అటవీ, గనుల శాఖలకు సంబంధించిన అంశాల్లో కొంత వెనుకబడి ఉన్నప్పటికీ, వ్యవసాయం మరియు ఆక్వా రంగాలలో జిల్లా మంచి పురోగతి సాధించినట్లు వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై ఏకీకృత కుటుంబ సర్వే, పి4, ఈకేవైసీ సర్వేలను వేగవంతంగా పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ కే.శివపార్వతి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సి.హెచ్ అప్పారావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, విజన్ ఆంధ్ర టీం సభ్యులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు..

# ఉండవల్లిలో సందడి: కూటమి ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేష్ 'ఆత్మీయ విందు'





**నంది పత్రిక –డోన్** మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేసిన 'ఆత్మీయ విందు' కార్యక్రమం అత్యంత వైభవంగా, కుటుంబ వేడుకను తలపించేలా సాగింది. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కూటమి ప్రజాప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ విందుకు హాజరయ్యారు.

**కుటుంబ సమేతంగా హాజరైన డోన్ నేతలు** ఈ విందులో డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కోట్ల సుజాతమ్మ దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రతి ఒక్కరినీ మంత్రి లోకేష్ వ్యక్తిగతంగా పేరుపేరునా పలకరిస్తూ, ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. రాజకీయాలకు అతీతంగా, ఒకే కుటుంబ సభ్యులంతా కలిస్తే ఎలా ఉంటుందో ఆ వాతావరణం అక్కడ నెలకొంది.

**మంగళగిరి పట్టుచీరల కానుక.. అభివృద్ధిపై సమీక్ష** విందుకు హాజరైన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ సాదరంగా మంగళగిరి పట్టుచీరలను బహూకరించి తన ఆత్మీయతను చాటుకున్నారు. కేవలం విందుకే పరిమితం కాకుండా, పాలనపై తనకున్న చిత్తశుద్ధిని లోకేష్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. గతంలో ప్రజాప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన ప్రాంతీయ సమస్యలు, వినతులపై సమగ్ర స్థితిగతుల నివేదికను మంత్రి వారికి అందజేశారు. ప్రతి విన్నపం ప్రస్తుతం ఏ దశలో ఉంది? నిధుల మంజూరు ప్రక్రియ ఎక్కడి వరకు వచ్చింది? అనే అంశాలను స్వయంగా వివరించారు."ఇది రాజకీయ కార్యక్రమంలా కాకుండా, మా ఇంట్లో జరిగిన వేడుకలా అనిపించింది. లోకేష్ చూపిన ఆప్యాయత, పాలనలో ఆయన చూపిస్తున్న పారదర్శకత మరువలేనివి."

**శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే, డోన్.** ప్రాంతీయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సాగిన ఈ ఆత్మీయ భేటీ కూటమి నేతల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమం కేవలం విందు మాత్రమే కాదు, క్షేత్రస్థాయి అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వీఆర్వోలు, వీఆర్ఏలు ఉచిత ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25 నంది పత్రిక** ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి తణుకు, ఏరియా హాస్పిటల్స్ తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, భీమవరంలలో ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 25వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం వీఆర్వోలు, వీఆర్ఏలకు నిర్వహించనున్న ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఫిబ్రవరి 26 నుండి మార్చి 4వ తేదీ వరకు తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు సంబంధించిన వారికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పటల్ నందు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలకు సంబంధించిన వారికి తణుకు ప్రభుత్వ జిల్లా హాస్పటల్ నందు. ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 5వ తేదీ వరకు నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాలకు సంబంధించి నరసాపురం ప్రభుత్వ ఏరియా హాస్పటల్ నందు ఫిబ్రవరి 26వ తేదీ నుండి మార్చి 11వ తేదీ వరకు పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు, పాలకొల్లు మండలాలకు సంబంధించి పాలకొల్లు ఏరియా హాస్పిటల్ నందు. ఫిబ్రవరి 26 వ తేదీ నుండి మార్చి 25 వ తేదీ వరకు భీమవరం, పాలకోడేరు, వీరవాసరం, ఆకివీడు, కాళ్ల, ఉండి, గణపవరం మండలాలకు సంబంధించి భీమవరం ఏరియా హాస్పిటల్ నందు షెడ్యూల్ ప్రకారము వైద్యులచే ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని అన్నారు. జిల్లాలోని పనిచేస్తున్న 456 మంది విఆర్వోలు, 626 మంది వీఆర్ఏలు తప్పనిసరిగా ఆరోగ్యపరీక్షలను చేయించుకోవడం ద్వారా, ఆరోగ్యవంతులుగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకాంక్షించారు.

## తెలంగాణ పోలీస్ క్రీడల్లో ములుగు జిల్లా క్రీడాకారులకు పతకాలు

### అభినందించిన జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐ పి ఎస్

### మరింతగా రానించాలి - క్రీడలు మానసిక ఉల్లాస్సాన్ని కలిగిస్తాయి

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 ( నంది పత్రిక)** 4వ తెలంగాణ పోలీస్ క్రీడా పోటీలు ఫిబ్రవరి 16 నుండి 21 వరకు సైబరాబాద్ లో ఘనంగానిర్వహించబడ్డాయి.రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ క్రీడా పోటీల్లో ములుగు జిల్లా పోలీస్ సిబ్బంది విశిష్ట ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వకారణం. ఈ క్రీడా పోటీల్లో ములుగు జిల్లా నుంచి పాల్గొన్న వారిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారు.

**పతక విజేతలు:** 1.అమిత్ కుమార్ సింగ్ రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో 63 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు

**తండ్రి:** బింద్యాచల్ సింగ్ **హోదా:** హెడ్ కానిస్టేబుల్ నెంబర్ 721 డిఏఆర్ ములుగు

**2.మేకల నాగరాజు** జూడో 81కేజీలా భాగంలో సిల్వర్ మెడల్

82 కిలోల కుస్తీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది

**తండ్రి:** కృష్ణమూర్తి **హోదా:** పోలీస్ కానిస్టేబుల్ నెంబర్ 70 ములుగు స్పెషల్ పార్టీ

ఈ సందర్భంగా ఈరోజు ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ గారు ఇద్దరు పతక విజేతలను అభినందించారు. వారి కృషి, పట్టుదల మరియు క్రీడా స్ఫూర్తిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లా పోలీస్ సిబ్బంది విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



## ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత.

### ఏర్పాటు చేసిన బేతంచెర్ల సఐ వెంకటేశ్వర రావు.




**బేతంచెర్ల ఫిబ్రవరి 25 (నంది పత్రిక ).** బేతంచెర్ల మండల కేంద్రములో జరుగు చున్న ఇంటర్మీడియట్ పరీక్షలను, ప్రతిష్ట భద్రత నడుమ బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బేతంచెర్ల లోని భద్రతా ఏర్పాట్లను సీఐ. వెంకటేశ్వరరావు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. బేతంచెర్ల పట్టణంలోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, ఆదర్శ కళాశాల లోని,పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీఐ.వెంకటేశ్వరరావు పరీక్షలు జరుగుతున్న తీరును,పోలీసు బందోబస్తును పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. "నిరంతర నిఘా –144 సెక్షన్ అమలు" పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ ఖచ్చితంగా అమలు చేయాలని, అపరిచిత వ్యక్తులు గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఒకవేళ గుంపు గుంపులుగా ఉంటే, చదరగొట్టమని ఆదేశాలు ఇచ్చారు. బేతంచెర్ల వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు విద్యార్థులు ఎటువంటి భయం లేదా ఒత్తిడికి లోను కాకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని సీఐ భరోసా ఇచ్చారు. మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి తావులేకుండా,పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేలా పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులకు, పరీక్షా సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో బేతంచెర్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గడ్డి మందుతో నాశనమైన పంటలు ఏజెంట్ మోసంతో నట్టేట మునిగిన రైతులు

### 8 ఎకరాల్లో ఎండిపోయిన సొద్ద పంట రూ.8 లక్షల నష్టం



**బి. కోడూరు ఫిబ్రవరి 25 (నంది పత్రిక):** వైయస్సార్ కడప జిల్లా బి.కోడూరు మండలం అమ్మవారిపేట (కృష్ణాపురం) గ్రామంలో గడ్డి నివారణ మందు కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన ముద్దం లక్ష్మి, ఓబయ్య, వెంకటయ్య, నాగమ్మ అనే రైతులు సుమారు 8 ఎకరాల్లో సొద్ద పంట సాగు చేశారు. గడ్డి నివారణ కోసం గ్రామానికి చెందిన ఏజెంట్ రామచంద్రయ్య ఇచ్చిన మందును పిచికారీ చేయగా, కొద్ది రోజుల్లోనే పంట మొత్తం ఎండిపోయిందని రైతులు వాపోతున్నారు. ఈ ఘటనలో తమకు సుమారు రూ.8 లక్షల వరకు నష్టం జరిగినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. "మేము చాలా పేద కుటుంబాలకు చెందినవాళ్లం. కౌలుకు భూమి తీసుకుని అప్పులు చేసి పంట సాగు చేశాం. విత్తనాలు, ఎరువులు, కూలీలకు లక్షల్లో ఖర్చు పెట్టాం. కానీ ఏజెంట్ ఇచ్చిన మందు కారణంగా మా పైరు మొత్తం మాడిపోయింది" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు."ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి? కుటుంబాలను ఎలా పోషించాలి? పిల్లలను ఎలా చదివించాలి? అప్పుల వారికి ఏమి సమాధానం చెప్పాలి? మా అప్పులు ఎలా తీరాలి? మేము ఎలా బతకాలి?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.పంట పూర్తిగా నష్టపోవడంతో జీవనాధారం కోల్పోయిన రైతులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. నష్టాన్ని భరించే స్థితిలో తాము లేమని, అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి, గడ్డి మందు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు స్పందించి తమకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పన్ను వసూలుకు ప్రజలు సహకరించాలి

### డీడీఓ వెంకట్ శేషయ్య



**పోరుమామిళ్ల, ఫిబ్రవరి 25 (నంది పత్రిక ):** పన్ను వసూలుకు ప్రజలు తప్పనిసరిగా సహకారం అందించాలని, తమ ఆస్తులకు సంబంధించిన పన్నులను పంచాయతీలకు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని బద్వేల్ డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకట్ శేషయ్య తెలిపారు. బుధవారం మండలంలోని రంగసముద్రం, పోరుమామిళ్ల పంచాయతీలలో నిర్వహిస్తున్న పన్ను వసూలు ప్రత్యేక డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. పన్నులను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే చెల్లించాలని సూచించారు. పంచాయతీల అభివృద్ధికి పన్నులు కీలకమైనవని, పన్నులు పూర్తిస్థాయిలో చెల్లించినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలలో పన్ను వసూలు లక్ష్యాలను మండలంలోని అన్ని పంచాయతీలకు కేటాయించామని తెలిపారు.ఈ ప్రత్యేక డ్రైవ్ శుక్రవారం వరకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగుతుందని వివరించారు. అనంతరం కృష్ణ శారదా కళాశాలలో పన్ను వసూలు ప్రక్రియను డీడీఓ పరిశీలించారు. పన్నులు చెల్లించని వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా అనర్హులవుతారని స్పష్టం చేశారు.

## శివ సాయిలక్ష్మి రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

### ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యాన్ని నిర్దేశిత కాల పరిమితిలో మిల్లింగ్ చేసి బియ్యం డెలివరీ ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మిల్లర్లను ఆదేశించారు.

**భీమవరం చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 25 నంది పత్రిక** పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో శివ సాయిలక్ష్మి రైస్ మిల్లును బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ 2025–26 సీజన్ కు సంబంధించి రైస్ మిల్లుకు రైతు సేవా కేంద్రాల నుండి ఎంత ధాన్యం వచ్చింది ఎప్పటి వరకు ఎంత శాతం వరకు ధాన్యాన్ని మిల్లింగ్ చేయడం జరిగింది. బియ్యమును సీఎంఆర్ గా ఎఫ్సీఐకి ఎంత డెలివరీ చేసి ఉన్నారు మరియు సివిల్ సప్లై కార్పొరేషన్కు ఎంత డెలివరీ ఇచ్చి ఉన్నారు అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్ నందు గోనె సంచులు ఉన్నవా లేదా సీఎంఆర్ డెలివరీ ఆలస్యంగా ఇవ్వడానికి గల కారణాలను రైస్ మిల్ యజమాని వివరాలను అడిగారు. ఇంకను రైస్ మిల్లు నందు ఎంత ధాన్యం ఉన్నది అని నిల్వ కట్టిన లాట్లను స్వయంగా పరిశీలించారు. రిజిస్టరు "ఎ" లో నమోదు చేసిన ధాన్యానికి మరియు రైస్ మిల్లు నందు భౌతికంగా ఉన్న ధాన్యానికి ఏమైనా తేడాలు ఉన్నవా అని పరిశీలించారు. రికార్డులు నమోదు చేసిన ప్రకారం కచ్చితంగా ఉండాలని అన్నారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనిచేయాలని ఎటువంటి అక్రమాలు జరిగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖరీఫ్ 2025–26 సీజన్ సంబంధించి నిర్దేశిత సమయం మార్చి31 నాటికి ఎలాంటి డెలివరీలు ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ఏటువంటి నిర్లక్ష్యం వహించిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.



# బొల్లె వెంకట చలమయ్య జ్ఞాపకార్థం వెంకటాపురంలో రక్తదాన శిబిరం.






**- రక్తదానం.. ప్రాణదానంతో సమానం**

**- ములుగు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు ఆత్మకూరి పట్టాబి.**

**- గర్భిణులు, తలసేమియా బాధితుల కోసమే రక్తదాన శిబిరం - ట్రస్ట్ చైర్మెన్ కొప్పుల మురళి.**

వెంకటాపురం, నూగూరు ఫిబ్రవరి 25: (నంది పత్రిక ) ఆపదలో ఉన్న వారికి ఇచ్చే రక్తం మరొకరికి పునర్జన్మను ఇస్తుందని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ములుగు జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆత్మకూరి పట్టాబి అన్నారు. బుధవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు బొల్లె వెంకట చలమయ్య జ్ఞాపకార్థం, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మరియు చేయూత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన భారీ రక్తదాన శిబిరాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టాబి మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఆరోగ్యవంతుడైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడ వచ్చని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి, వారిని అభినందించారు.

**గర్భిణులు, తలసేమియా బాధితుల కోసమే రక్తదాన శిబిరం**

**మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి.**

గర్భిణీ స్త్రీలు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల అవసరాల నిమిత్తం ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 33 యూనిట్ల రక్తాన్ని సేకరించామని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్, రక్తదాన శిబిరం నిర్వాహకులు బొల్లె సుదీర్, భాను, దాసు, సౌమిత్, బట్టి విజయ సూర్య, తాటి శ్రావణ్, కూసం సాంబం, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు ఆదినారాయణ, పార్థు తదితరులు పాల్గొన్నారు.



## మహిళల భద్రతకు కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యం




ములుగు జిల్లా బ్యూరో ఫిబ్రవరి 25( నంది పత్రిక ) నిర్భయ ఫండ్ కింద 'ఇన్‌క్లూజివ్ సిటీస్' ప్రాజెక్టు ప్రారంభం,పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లా ఎంపికడీపీఆర్ తయారీపై మార్గదర్శకాలుమహిళలకు సురక్షిత పట్టణ వాతావరణమె లక్ష్యం నేడు, (25.02.2026) మహిళల భద్రత, గౌరవం మరియు బారియర్ ఫ్రీ మొబిలిటీ అనే ప్రాజెక్టు లో భాగంగా కేంద్ర ప్రభుత్వం మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సిబ్బంది, మరియు రాష్ట్ర మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి మరియు డైరెక్టర్ డబ్ల్యూ డి & సి డబ్ల్యూ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ ) నిర్వహించారు, ఇందులో భాగంగా మహిళలు మరియు బాలికల భద్రతను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతర చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో "ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్" అనే ప్రత్యేక ప్రాజెక్టును నిర్భయ ఫండ్ క్రింద ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ ప్రాజెక్టు ముఖ్యంగా టైర్-2 మరియు టైర్ -3 పట్టణాల్లో అమలు చేయడానికి రూపొందించారని, దేశవ్యాప్తంగా పది నగరాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు, ఆ పది నగరాల్లో ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా ను ఎంపిక చేసినట్లు వారు తెలియజేసారు. సమావేశంలో ప్రాజెక్టు అమలు విధానం, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ, వివిధ శాఖల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉన్నత స్థాయి నోడల్ అధికారిని నియమించడం, సంబంధిత శాఖలు మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ, పట్టణ స్థానిక సంస్థలు మరియు రవాణా శాఖ తదితర విభాగాల సమన్వయంతో డీపీఆర్ సిద్ధం చేయాలనీ వివరించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పత్రాలతో కూడిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సమర్పించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ములుగు జిల్లాలో మహిళలు మరియు బాలికలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు సమాన అవకాశాలు కలిగిన పట్టణ వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ టి.ఎస్. దివాకర వీడియో కాన్ఫరెన్స్ లో తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) శ్రీ సంపత్ రావు మరియు జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఈ.పి. ప్రేమలత పాల్గొన్నారు.

# అకాల వర్షాలు, గాలి దుమారాలతో నేలకు ఒరిగిన మిర్చి, మొక్కజొన్న చేలు.





**కళ్ళాల్లో ఆరబెట్టిన మిర్చి పంట తడవకుండా బరకాలతో రైతన్నల పరుగులు.**

వెంకటాపురం నూగూరు ఫిబ్రవరి 25 (నంది పత్రిక .) అకాల వర్షాలు గాలి దుమారాలతో, పంట చేతికి వచ్చే దశలో ప్రక్రుతి విలయతాండవం కారణంగా ప్రధాన వాణిజ్య పంటలు మిర్చి పంట,మొక్క జొన్న గాలి దుమారాలతోనేలకు ఒరిగిపోయింది. ఎకరానికి సుమారు రెండు లక్షల రూపాయలుకు పైగా మిర్చి తోటలకు పెట్టుబడులు పెట్టి, మొదటి మిరప పండ్ల కోత ప్రారంభమై, కల్లాలలో మిర్చి పళ్ళను రైతులు ఆరబెట్టారు. మరి కొంతమంది రైతులు రెండవ మిర్చి పళ్ళ కోతకు సన్నద్ధమవుతుండగా, బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సోమవారం నుండి మబ్బులు కమ్మిన ఆకాశంతో, మంగళవారం రాత్రి భారీ గాలి దుమారంతో వర్షం కురిసింది. దీంతో నిండు కాపుతో ఉన్న మిర్చి మొక్కలు వర్షం గాలి,దమారంతో నేలకు ఒరిగిపోయాయి. మొక్కలు చెట్లకు కాసిన కాయలు సైతం నేలకు ఆనుకున్నాయి. బాండు మొక్కజొన్న పంటలు సైతం భారీ వర్షం గాలి దుమారాలకు నష్టం వాటిల్లింది. కల్లాలలో ఆరబెట్టిన మిరప పళ్ళు వర్షాలకు తడిసిపోకుండా ఉండేందుకు రైతులు ప్లాస్టిక్ బరకాలతో ఉరుకులు పరుగులు చేస్తున్నారు. పంటలు చేతికి వచ్చే దశలో ప్రకృతి విలయ తాండవం చేయడంతో రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. మిర్చి మార్కెట్లో కొద్దో, గొప్పో రేటు ఆశా జనకంగా ఉండటంతో, ఈ ఏడాదైనా పంట చేతికి వచ్చి అప్పులు తీరుతాయని రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో, అకాల వర్షాలు రైతులను కుంగ తీస్తున్నాయి. వర్షాలు, గాలి దు మారల కారణంగా పంట నష్టపోయిన రైతులను సర్వే చేసి గుర్తించి, నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు, రైతు సంఘాలు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, ములుగు జిల్లా కలెక్టర్, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మబ్బులు కమ్మిన ఆకాశం వర్షాలు పడే సూచనలు కొనసాగుతుండడంతో, రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



## ఐటీడీఏ పీవో తాడ్వాయి మండలం బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలను సందర్శన



ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 ( నంది పత్రిక) ఏటూరునాగారం ఐటీడీఏ పీవో తాడ్వాయి మండలం బాలికలఆశ్రమ జూనియర్ కళాశాలను సందర్శించారు.నేటి నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలపై ప్రిన్సిపాల్ మరియు సిబ్బందితో సమీక్షించారుఆశ్రమ జూనియర్ కళాశాల, తడ్వాయి మరియు జగ్గన్నపేట లో పరీక్షా ప్యాడ్‌లు, స్టేషనరీ కిట్‌ల అవసరాన్ని గమనించి, తదనుగుణంగా పరీక్షా కేంద్రానికి పరీక్షా ప్యాడ్‌లు, స్టేషనరీ కిట్‌లు మరియు ట్రావెలింగ్ అలవెన్స్‌లను సరఫరా చేశారు.ప్రిన్సిపాల్ మరియు సెంటర్ ఇన్‌ఛార్జ్‌లు మరియు ఏఎన్ఎం లకు విద్యార్థులతో పాటు పరీక్షకు సంబంధించిన ఏవైనా ఆందోళనలు, నిర్జలీకరణం మరియు ఆరోగ్యసమస్యలను పర్యవేక్షించాలనిఆదేశించారు.అంతేకాకుండా, మరమ్మత్తు మరియు గ్రిల్ అవసరాలను అంచనా వేసి, ఈ ప్రాంతంలో కోతుల బెడద కోసం సోలార్ ఫెన్సింగ్‌ను చేపట్టారు. ఐటీడీఏ మరియు డీడీ, టి డబ్ల్యూ కార్యాలయం షెడ్యూల్ ప్రకారం గిరిజన సంక్షేమ జూనియర్ కళాశాల కోసం దాని సజావుగా నిర్వహణను పర్యవేక్షిస్తోంది.

# బంజారాల సంక్షేమం కోసం ప్రభుత్వ ప్రత్యేక దృష్టి.



**- అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలి.**

**- సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంను అనుసరించాలి.**

**- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25( నంది పత్రిక) రాష్ట్రంలోని బంజారా కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని రంగాలలో బంజారా కులస్తులు అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుదవారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ గుడి హరిత హోటల్ పక్కన తెలంగాణ ప్రభుత్వం సద్గురుసంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలంలో సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి కార్యక్రమం అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం హర్షించదగ్గ విషయమని, బంజారా కులస్తులు భవన నిర్మాణం ఏర్పాటు చేసుకోవడానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వం వారి సంక్షేమం కోసం వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. సమావేశానికి ముందు సీతక్క బంజారా భాషలో మాట్లాడి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. జిల్లాలో గిరిజన అధికారులు సామాజిక అభివృద్ధి అంశాలలో చొరవ తీసుకోవాలని, సంత్ సేవాలాల్ చూపిన ఆశయాలను అందరి సహకారంతో సాధించాలని, గిరిజన జాతి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. ములుగు బంజారాల కుల పెద్ద పోరిక గోవింద్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు మద్దిమడుగు లో 20 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం కోసం కేటాయించినందుకు, ములుగు జిల్లా గట్టమ్మ వద్ద సుమారు 20 గుంటల స్థలం, ఆలయ నిర్మాణం కోసం పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపినందుకు ములుగు జిల్లా బంజరాల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పోరిక గోవింద్ నాయక్, పూజారులు రమేష్ గిరి మహారాజ్, కిషన్ మహారాజ్, ఐటిడిఏ అధికారి జనార్ధన్, రాహుల్, బంజారా కులస్తులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# యూరియా బస్తాల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పర్టిలైజర్ యజమానులు





### వంత పాడుతున్న మల్లంపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి
### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రత్నం ప్రవీణ్

**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 ( నంది పత్రిక )** మల్లంపెల్లి మండలకేంద్రంలో యూరియా బస్తాలు పెద రైతులకు (చుట్టూ పక్కల గ్రామాల రైతులకి) ఇవ్వకుండా రైతు సేవ కేంద్రం కు సంబంధించిన గోదాం నుండి పెద్ద రైతులకు భూస్వాములకు ట్రాక్టర్ల లోడ్లు నింపి పంపిస్తూ అధిక ధరలకు విక్రయిస్తు ప్రైవేట్ పర్టిలైజర్ యజమానులు వారికి వంత పాడుతూ మండల వ్యవసాయ శాఖ అధికారి ఇష్టరాజ్యం గా వ్యవహరిస్తూన్నారని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సిపిఎం) ములుగు జిల్లా కమిటీ సభ్యులు రత్నం. ప్రవీణ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఏవో వినయ్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లంపల్లి మండల కేంద్రంలో ఉన్న లక్ష్మి ఫర్టిలైజర్ హకా (రైతు సేవ కేంద్రం) షాపు యజమాని గత వారం రోజుల నుండి పేద రైతులు పట్టా పాస్ బుక్ భూమి కాగితాలు పట్టుకొని రెండు మూడు యూరియా బస్తాలు కావాలని చెప్పులు అరిగేలా తిరిగినా గాని పట్టించుకోకుండా లేవు అని సమాధానం చెబుతూ ఆన్లైన్లో చేసుకోవాలి అంటూ బస్తాలు ఇవ్వకుండా దాచుకొని నిన్న రాత్రి 9 గంటల సమయంలో 350 పైగా యూరియా బస్తాలను రెండు ట్రాక్టర్లోర్లు నింపి అక్రమంగా భూస్వాములకు ఇవ్వడం జరిగింది ఒక పక్క పేద రైతులు ఒకటి రెండు కావాలని అడుగుతున్న ఇవ్వకుండా కృత్రిమ కొరత సృష్టించి ఆయా బస్తాలన్నింటినీ భూస్వాములకు అధిక రెట్లకు అమ్ముకుంటూ ఇష్ట రాజ్యాంగ వ్యవహరించడం జరుగుతోంది ఆయా విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి తెలియజేయగా ఆ అధికారి కూడా ఫర్టిలైజర్ యజమానితో ఫోన్లో మాట్లాడి ఫలానా రైతులు నీ పైన ఫిర్యాదు చేస్తున్నారు అని ఫర్టిలైజర్ షాపు యజమానికి చెపుతూ ఆయనకు వత్తాసు పలకడం వల్ల ఆయా యజమాని ఎవరైతే రైతులు ఉన్నారో వారిని తిడుతూ దుర్భాషలాడుతూ వారి పై గొడవలకు పోతు మీకు పిండి బత్తాలు ఇవ్వము ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి అని హేళన చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం జరుగుతోంది మల్లంపల్లి మండల కేంద్రంలో ఉన్న ఈ ఫర్టిలైజర్ షాప్ కు అసలు యూరియా బస్తాలు బుకింగ్ షాప్ లిస్టులో ఈ షాప్ పేరు లేదు పర్మిషన్ లేదు అలాంటప్పుడు ఆయా ఫర్టిలైజర్ షాప్ లో ఎలా పిండి బస్తాలు అమ్మడం జరుగుతుంది ఆన్లైన్లో పిండి బస్తాలు బుకింగ్ చేసుకోవాలనుకున్నప్పుడు మండల వ్యాప్తంగా ఒక రామచంద్రపూర్ ఫర్టిలైజర్ షాప్ మాత్రమే చూపించడం జరుగుతోంది అలాంటప్పుడు అక్కడ యూరియా కొరత చూపించడం జరిగింది కానీ ఆన్లైన్లో అసలు షాప్ పేరే నమోదు లేని ఫర్టిలైజర్ షాప్ గోదాం లో అన్ని వందల ఫర్టిలైజర్ యూరియా బస్తాలు ఎక్కడి నుండి వచ్చాయి వ్యవసాయశాఖ అధికారులు ఏం చేస్తున్నారు ఆయా విషయాల పైన మండల వ్యవసాయ శాఖ అధికారిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వకుండా ఇష్టానుసారంగా మాట్లాడి సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేయడం జరుగింది ఈ విధమైన అంశాలన్నింటిపైన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది ఎవరైతే యూరియా బస్తాల కొరత సృష్టించి భూస్వాములకు మాత్రమే వందలకు వందలు బస్తాలు ఇస్తున్నారో ఆయా లక్ష్మి ఫర్టిలైజర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి షాపును మూసివేయాలి అలాగే ప్రైవేటు ఫర్టిలైజర్ యజమానులకు గతంలో కూడా ఇలానే వత్తాసు పలుకుతున్న మల్లంపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి గారి పైన కూడా చర్యలు తీసుకోవాలి సస్పెండ్ చేస్తేనే ప్రైవేట్ ఫర్టిలైజర్ ఆగడాలు తగ్గుతాయని అన్నారు . ఈ విధమైన యూరియా కొరత సృష్టించడం వల్ల చిన్న సన్న గారు రైతులందరూ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే జిల్లా వ్యాప్తంగా కూడా ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంది చదువుకోలేని రైతులు పట్టా పాస్బుక్ లేని రైతులు చాలామంది ఉన్నారు అలాంటి వారందరికీ ఈ ఆన్లైన్ విధానం పెట్టడం వల్ల యూరియా బస్తాలు దొరకక బ్లాక్లో అధిక ధరలు చెల్లించి కొనుక్కోవలసిన పరిస్థితి ఇదే అదునుగా ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులు యూరియా బ్లాక్ దందాను నిర్వహిస్తూ అధిక ధరలు కు అమ్ముతూ పేద సన్నకారు రైతులను ఆర్థిక దోపిడీ చేస్తున్నారు ఈ తథంగామంతా జిల్లా వ్యవసాయ శాఖ అంతా చూస్తూనే నిమ్మకు నీరు ఎత్తినట్టుగా అలా ఉండిపోతా ఉన్నది ఇప్పటికే వివిధ మండలాలలో క్రాఫ్ రిజిస్ట్రేషన్ పంట నమోదు కు సంబంధించి మండల వ్యవసాయ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేయాలి అలా రిజిస్ట్రేషన్ సరిగ్గా చెయ్యకపోవడం వల్ల రైతుల అనేక మంది ఈరోజు మండల వ్యవసాయ శాఖ అధికారుల వెంబడి తిరుగుతున్న వాళ్లు పట్టించుకోవడం లేదు ఇదే అదునుగా 1000 నుండి 2000 తీసుకొని క్రాఫ్ రిజిస్ట్రేషన్ (పంట నమోదు) చేస్తున్నారు ఆయా రిజిస్ట్రేషన్ పెట్టుకొని యూరియా బస్తాలు తీసుకోవాలని ఆలోచనతో ఈరోజు రైతులు ఉన్నారు ఈ విధంగా రైతుల అవసరాలను కూడా వ్యవసాయ శాఖ అధికారులు ఆసరా చేసుకొని రైతులను మరింత ఆర్థిక దోపిడీ చేస్తున్నారని వారు తెలియజేశారు వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్పందించి యూరియా దందాను అరికట్టాలి అలాగే రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా బస్తాలు పంపిణీ చేయాలి ప్రైవేటు ఫర్టిలైజర్ యజమానుల ఆగడాలను దందాను అరికట్టాలని వారి డిమాండ్ చేశారు లేనియెడల రైతులను ప్రజలను సమీకరించి ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తోకల రవి మరియు మల్లంపల్లి మండల పార్టీ నాయకులు జన్ను దేవేందర్ గణేష్ అశోక్ యాకయ్య బాబు తదితరులు పాల్గొన్నారు



## జోలేలోనే దవాఖానకు తలలింపు

### వలస కూలీ అనారోగ్యం సహచరుల మానవతా స్పందన, 108 అంబులెన్స్ సేవల ద్వారా చికిత్స



**ములుగు జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 ( నంది పత్రిక )** ములుగు జిల్లా పరిధిలోని నూగూరు ప్రాంతం, వెంకటాపురం మండలంలో వలస కూలీల దుస్థితి మరోసారి వెలుగులోకి వచ్చింది. పని నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన ఓ వలస కూలీ తీవ్ర జ్వరంతో అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు.సమీపంలో తగిన వైద్య సదుపాయాలు లేకపోవడంతో, అతని సహచర కూలీలు మానవతా దృక్పథంతో అతడిని సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఒక కర్రకు జోలకట్టి మోస్తూ మండల కేంద్రంలోని బస్ స్టేషన్ వరకు తీసుకువచ్చారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్ సర్వీస్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న 108 సిబ్బంది తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని బాధితుడిని సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం అతనికి అవసరమైన వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం.ఈ ఘటన వలస కూలీలు ఎదుర్కొంటున్న ప్రాథమిక వసతుల లోపాన్ని మరోసారి స్పష్టంగా చూపించింది. ముఖ్యంగా నివాస, ఆరోగ్య, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కొరత కారణంగా వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో పనిచేస్తున్న వలస కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, తగిన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, తక్షణ వైద్య సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## ‘మేధా’ శిఖరాలపై భారత్

ఐటీ రంగంలో భారతీయ ప్రతిభ సాధిస్తోన్న పురోగతి అద్భుతమైనది. భారత్‌కు ఉన్న ‘విశ్వగురు’ అన్న ప్రఖ్యాతిని అది సార్థకం చేస్తోంది. ఆ సాంకేతికత అధునాతన వికాసంలో యువ భారతీయుల విజయాల ఆలంబనతో దేశ ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపచేసేందుకు భారతీయ దౌత్యవేత్తలు అపూర్వ కృషి చేస్తున్నారు. నవ నవీన సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) బహుముఖీన ప్రభావంపై ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన అయిదు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆ కృషిలో భాగమే. అమెరికా, యూరోపియన్ దేశాలను ఎంతగా ఆకర్షించిందో, అరబ్ దేశాలను, లాటిన్ అమెరికాను, ఆఫ్రికా దేశాలనూ అంతగా ఆకర్షించిన విశిష్ట సదస్సు అది. కొన్ని కారణాలతో మనతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కెనడాతో పాటు, ఐటీ, ఏఐలలో చాలా ముందంజలో ఉన్న దేశాలు కూడా భారత్ ఆహ్వానాన్ని మన్నించి న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత సామర్థ్యంపై ప్రపంచ దేశాలకు పరిపూర్ణ విశ్వాసం ఉన్నదనడానికి ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026’ ఒక తిరుగులేని తార్కాణం. ఇటువంటి సదస్సులలో గల్ఫ్ దేశాల రాచకుటుంబీకులు పాల్గొనడం చాలా అరుదు. గల్ఫ్‌లో అత్యధిక డేటా సెంటర్లు నిర్వహిస్తూ, వాటి సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించడానికి ప్రయత్నిస్తోన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పక్షాన అబుదాబి యువరాజు షేక్ ఖాలీద్ ఈ న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ యూఏఈ యువరాజుకు స్వాగతం పలుకగా, ప్రధాని మోదీ ఆయన గౌరవార్థం విందు ఇచ్చారు. సౌదీ అరేబియా ఉన్నతాధికార వర్గాలు కూడా ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఈ ఏఐ సదస్సును విజయవంతం చేసేందుకు భారత విదేశాంగ శాఖ అధికారులు రేయింబవళ్ళు కష్టపడ్డారు. కొన్ని విషయాలకు సంబంధించి, ఆహ్వానితులు అడిగిన సమాచారం ఇవ్వడానికి నిజాయితీగా శ్రమించారు. ఆ సందర్భంలో తెలుగు రాష్ట్రాల అధికార వర్గాలను కూడా భారత దౌత్యవేత్తలు సంప్రదించిన విషయం కొందరికి మాత్రమే తెలుసు. అగ్ర రాజ్యాలు, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులతో పాటు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ మొదలైన టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌తో భారత్ యశోచంద్రికలు మరింతగా విరాజిల్లాయి. బ్రిటన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌లు మాత్రమే ఇప్పటివరకు అంతర్జాతీయ ఏఐ సదస్సులు నిర్వహించాయి. ఆ మూడు దేశాల్లో సదస్సుల కంటే న్యూఢిల్లీ సదస్సే బాగా విజయవంతమయింది. రానున్న కాలంలో కృత్రిమ మేధస్సు రంగానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ఈ సదస్సు జరిగిందనడంలో అతిశయోక్తి లేదు. పారిస్ సదస్సులో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అమెరికా, బ్రిటన్‌లు పారిస్ డిక్లరేషన్‌లో భాగస్వాములు అయ్యేందుకు నిరాకరించాయి. అయితే న్యూఢిల్లీ డిక్లరేషన్‌పై ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆ రెండు దేశాలు సైతం సంతకం చేశాయి. సదస్సులో భాగంగా జరిగిన 500 గోష్ఠులలో అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రిటన్ సహా 88 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కీలక భూమిక వహించనున్న కృత్రిమ మేధస్సు రంగం కేవలం కొందరి చేతులలో కేంద్రీకృతం కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, తప్పుడు సమాచార వ్యాప్తి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ కోరింది. ఈ నవీన సాంకేతికతను ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధికి ఒక చోదక శక్తిగా మార్చాలని భారత్ పిలుపునిచ్చింది. తద్వారా భారత్ తన నాయకత్వపు దార్శనికతను స్ఫూర్తిదాయకంగా వెల్లడించింది. బహు భాషలు విలసిల్లుతోన్న భారత్‌లో ప్రతి భారతీయుడూ ఏఐని తన మాతృభాషలో వినియోగించుకునేందుకు వీలుగా ‘సర్వం’ పేర ఆవిష్కృతమైన భారతీయ భాషల విధానం (ఎల్.ఎల్.ఎం, ఎస్.ఎల్.ఎం) ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలిచింది. ‘కృత్రిమ మేధస్సు రూపకల్పన, అభివృద్ధి భారత్‌లో జరిగినా వాటి ఫలాలు, ప్రయోజనాలు సమస్త దేశాలకు చెందుతాయని’ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆయన గంభీరవాణి ఇంట కంటే బయటే ఎక్కువగా ప్రతిధ్వనించింది. కనుకనే దేశంలోకి భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి అనేది ఇక్కడ గమనార్హం. కృత్రిమ మేధస్సు పనితీరు, దాని విధి విధానాలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బాలారిష్టాల దశలో ఉన్నాయి. ఇందుకు భారత్ మినహాయింపు కాదు. కృత్రిమ మేధస్సు, డేటా సెంటర్లకు అవసరమైన నీటి లభ్యత, స్థల సేకరణ, ఇతర మౌలిక ఆవశ్యకతలపై ఆశాజనక చర్చ జరగలేదు. అదే విధంగా ఏఐతో కొత్త ఉద్యోగాల సృష్టి, ఉన్న ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే అవకాశాలను కూడా సదస్సు విస్మరించింది. కృత్రిమ మేధస్సును ప్రోత్సహించడంలో భాగంగా పలు ప్రైవేటు సంస్థలు కూడా న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. వాటిలో ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం కూడా ఉన్నది. చైనాలో రూపొందిన ఒక మర కుక్కను తమ స్వంత ఆవిష్కరణగా ఆ ప్రైవేట్ విశ్వవిద్యాలయం ప్రకటించుకుని అభాసుపాలైంది. సదరు ప్రైవేటు విశ్వవిద్యాలయ మహిళా ప్రతినిధి తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేసిన వాదనలతో అసలు వంచన రచ్చకెక్కింది. ఇది ముమ్మాటికీ దగా అనడంలో సందేహమేమీ లేదు. విషయం తెలిసిన వెంటనే అధికారులు ఆ మరకుక్కను ప్రాంగణం నుంచి తొలగించి తమ బాధ్యతను నిర్వర్తించారు, అయితే అప్పటికే దానిపై ఎంతో రభస జరిగిపోయింది. ప్రాంగణం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన భారత్ పేరు ప్రతిష్ఠలకు మచ్చగా మిగిలిపోయింది. ఏదేమైనా, అంతర్జాతీయంగా భారత్ కీర్తిని ఇనుమడింపజేసిన ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026’ను దేశీయంగా రచ్చకీడ్చడం జాతి ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందుతున్న విదేశాంగ విధానానికి విఘాతం కలిగించడమే.

## భారత్‌కు భాగవత్ దిశా నిర్దేశమేమిటి?

దేశం ఇప్పుడు ఒక సైద్ధాంతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సిద్ధాంతాల ప్రాతిపదికన జరిగిన అనేక ఉద్యమాలు పరీక్షలకు, సమీక్షలకు, వైఫల్యాలకు లోనై కొట్టుకుపోయాయి. సైద్ధాంతిక దారిద్ర్యం అంతటా తాండవిస్తోంది. సమాజం పట్ల, అణగారిన వర్గాల పట్ల సానుకూల దృక్పథంతో ఆలోచించేవారు ఒక మూసలో ఇమడలేకపోతున్నారు. ఇప్పుడే కాదు, గతంలో కూడా తత్వవేత్తలు ఇలాంటి సామాజిక పరిస్థితులను ఎదుర్కొని విశ్లేషించిన సందర్భాలున్నాయి. మరి మోహన్ భాగవత్ ప్రస్తుత అయోమయ పరిస్థితులలో ఏమి మాట్లాడతారా అన్న ఆసక్తితోనే అనేకమంది ఆయన సభలకు హాజరు అవుతున్నారని అర్థం చేసుకోవల్సి వున్నది. రకరకాల భావజాలాల అనుయాయులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ విస్తరిస్తుండడం, దాని అనుబంధ రాజకీయ సంస్థ అయిన భారతీయ జనతా పార్టీ తిరుగులేని జాతీయ రాజకీయ శక్తిగా ప్రభావ ప్రాబల్యాలను సంతరించుకోవడం ఒక రకంగా సంఘ్ పరివార్ శక్తులకు సదవకాశం. అయితే 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఒక నిర్దుష్టమైన స్పష్టతతో ఉన్నదా? ఈ విషయాన్ని తరచి చూడవలసిన అవసరం ఉన్నది. హెగ్డేవార్ స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పటి ఆర్‌ఎస్ ఎస్‌కూ ఎంతో తేడా ఉన్నది. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడానికి, గత పది సంవత్సరాలకు పైగా నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా కొనసాగడానికి కారణమైన ఆర్‌ఎస్‌ఎస్ ఇవాళ ఒక సంధి దశలో ఉన్నది. కేంద్రంలో మోదీ ఇవాళ ఏమి చేసినా జనం ఆర్‌ఎస్‌ఎస్ వైపు చూస్తున్నారు. మోదీ చేసిన మంచి పనులకు ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎంత ఘనత లభిస్తుందో, ఆయన తీసుకున్న అన్ని నిర్ణయాలకూ ఆర్‌ఎస్‌ఎస్ జవాబుదారీ అవుతుందని చాలా మంది భ్రమిస్తున్నారు. అయోధ్యలో బాల శ్రీరాముడి ప్రతిష్ఠాపన సమయంలో నరేంద్రమోదీ వెనుక మోహన్ భాగవత్ ఉన్న దృశ్యాలను చూసినవారు మోదీకి అన్ని విషయాల్లోనూ మోహన్ భాగవత్ అండగా ఉంటారనుకోవడంలో ఆశ్చర్యం లేదు. విచిత్రమేమంటే జాతీయవాదులు అని తమను తాము చెప్పుకుంటున్నవారు కూడా మోదీ చేసిన అన్ని పనులను పిడివాదంతో సమర్థించడం, ప్రత్యర్థులపై తీవ్ర పరిభాషలో విరుచుకుపడడం ప్రస్తుత సైద్ధాంతిక అయోమయాన్ని మరింతగా తీవ్రతరం చేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్‌కూ బీజేపీకి మధ్య ఉన్న తేడాను స్పష్టంగా చెప్పేందుకు మోహన్ భాగవత్ అనేక సమావేశాల్లో ప్రయత్నించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎలాంటి రాజకీయ అధికార ఆకాంక్ష లేదని, మొత్తం హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం, పౌరుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం తమ ఏకైక లక్ష్యమని ఆయన ఇటీవల డెహ్రాడూన్‌లో మాజీ సైనికాధికారుల సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను బీజేపీతో పోల్చి చూడకూడదని, బీజేపీ కళ్లతో ఆర్‌ఎస్‌ఎస్‌ను చూడడం అతి పెద్ద తప్పిదమని ఆయన గత ఏడాది కోల్‌కతాలో చెప్పారు. కాని చాలా మంది తటస్థ వాదులకు ఆర్‌ఎస్‌ఎస్ అంటే బీజేపీయే. దాదాపు 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో లేకపోతే, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇవాళ ఇంత ప్రాధాన్యం లభించేది కాదని వారు వాదిస్తున్నారు. అధికారం అనేది ఒక అయస్కాంతం లాంటిది. ఆ అయస్కాంతానికి ఆకర్షితులైనవారందరూ నేడు ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా ఆకర్షితులవుతున్నారు. మోహన్ భాగవత్ సమావేశాలకు వచ్చిన వారందరూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం నచ్చి వచ్చి ఉంటారని అనుకోవడానికి వీల్లేదు. భాగవత్, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దల దృష్టిలో పడడం వల్ల, ఆ సమావేశాలకు హాజరయ్యామని చెప్పుకోవచ్చు; ఆ పెద్దలతో ఫోటోలు దిగి ప్రచారం చేసుకోవచ్చు; తద్వారా తమకేదో మేలు జరుగుతుందనే అభిప్రాయం అటువంటివారిలో నెలకొని ఉన్నదని స్పష్టమవుతోంది. ‘బీజేపీ అధికారంలో లేకపోతే ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎవరు పట్టించుకుంటారు?’ అని ఆ సమావేశానికి వెళ్లి వచ్చిన ఒక మేధావి వ్యాఖ్యానించారు. బహుశా తమలో బలంగా లేని ఒక భావజాలం తమకు నచ్చిందని పైకి ప్రకటించడం వల్ల కొందరు ప్రయోజనాలు, పదవులు, పురస్కారాలు పొంది ఉండవచ్చు. ఈ స్వార్థపరత్వం మరికొందర్ని ఆకర్షిస్తోంది. బీజేపీలో మంత్రులుగా ఉన్నవారందరికీ సంఘ్ భావజాలం గురించి అంత బలమైన అవగాహన ఉన్నదని చెప్పేందుకు ఆస్కారం లేదు. ఈ బూటకత్వాన్ని సంఘ్ పరివార్‌లో కొందరు గమనించే ఉంటారు. ‘ముందు వచ్చిన చెవులకంటే వెనుక వచ్చిన కొమ్ములే వాడి’ అని వాపోయేవారు లేకపోలేదు. సమాజంలో ఇలాంటి పరిణామాలు సహజమైననప్పటికీ ఇవాళ ఆర్‌ఎస్‌ఎస్ అనేది బీజేపీకంటే ఎంతో భిన్నమైన, బలమైన, విస్తృతమైన సంస్థ. బీజేపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాధాన్యం తగ్గే అవకాశాలు ఏ మాత్రం లేవు. నిజానికి ఆర్‌ఎస్‌ఎస్ ఒక రాజకీయ పార్టీకి కట్టుబడి ఉన్న సంస్థ కానే కాదు. ఒకప్పటి ఆర్‌ఎస్‌ఎస్‌కూ ఇప్పటి ఆర్‌ఎస్‌ఎస్‌కూ మధ్య చాలా వ్యత్యాసమున్నది. 1925లో ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ 1937 వరకూ కాంగ్రెస్‌లో ఉన్నారని ఎంత మందికి తెలుసు? ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించేందుకు ఒక సామాజిక భూమిక లేకపోలేదు. కాంగ్రెస్‌లో మితవాద, అతివాద ఘర్షణల పర్యవసానంగా గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ నాయకత్వం చేపట్టడం, రష్యాలో విప్లవానంతరం దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడం, అంబేడ్కర్ నాయకత్వంలో మహారాష్ట్రలోని మహడ్‌లో అస్పృశ్యులు చెరువునుంచి నీరు తాగేందుకు ఉద్యమించడం తదితర పరిణామాల సమయంలోనే ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించింది. తిలక్ వారసత్వాన్ని గౌరవించిన హెగ్డేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను కులాలకు అతీతంగా, సమస్త కులాలను కలుపుకుపోయే సంస్థగా రూపొందించాలనుకోవడానికి కూడా సామాజిక నేపథ్యం ఎంతో ఉన్నది. భారత జాతీయ కాంగ్రెస్‌లో నెహ్రూ ఆవిర్భవించి ఆధునిక యూరోపియన్ సమాజాల సెక్యూలరిజం స్ఫూర్తితో కాంగ్రెస్ భావజాలాన్ని ప్రభావితం చేయడం ప్రారంభమై తరువాతే ఆర్‌ఎస్‌ఎస్‌కూ కాంగ్రెస్‌కూ మధ్య దూరం మరింత పెరిగిందనేవారున్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంతో స్వాతంత్ర్య సమరంలో ప్రజలను గాంధీ, నెహ్రూ సంఘటితపరుస్తూ దేశాన్ని ఏకతాటిపైకి తెస్తున్న సమయంలో ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు కమ్యూనిస్టు నేతలూ ప్రేక్షకులయ్యారు. 1940లో హెగ్డేవార్ మరణం తర్వాత గురూజీ అని సంఘ్ గౌరవంగా పిలుచుకునే గోల్వాల్కర్ సంఘ్ బాధ్యతలు చేపట్టడంతో ఆ సంస్థ స్వరూప స్వభావాలు మారిపోయాయి. దేశ విభజన ఆయన హయాంలోనే జరగడం, విభజన రేకెత్తించిన మత విద్వేషాల వల్ల సంఘ్ సైద్ధాంతిక స్వరూపం తీవ్రంగా మారిపోయింది. 1948లో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించిన తర్వాత ఆయనను అరెస్టు చేశారు. గోల్వాల్కర్ మరణం తర్వాత 1973లో మూడవ సర్ సంఘ్ చాలక్ అయిన దేవరస్ గోల్వాల్కర్ కంటే భిన్నంగా ఆలోచించి రాజకీయాల్లో, సామాజిక కార్యచరణలో క్రియాశీలక పాత్ర పోషించేందుకు ఆర్‌ఎస్‌ఎస్‌కు వీలు కల్పించారు. దాన్నొక ప్రజా సంస్థగా మార్చేందుకు ప్రయత్నించారు. జనసంఘ్, సోషలిస్టులు, స్వతంత్ర పార్టీ సభ్యులతో కలిసి జేపీ ఉద్యమంలో పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com